## చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించాలి : సివిల్ జడ్జి కవితాదేవి

**జహీరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గం లోని కోహీర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గురువారం చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి జి కవితదేవి మాట్లాడుతూ ప్రామిసరీ నోటల్లో, వివాహాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు భూ తగాదాల నివారణ, గృహ హింస, డోమెస్టిక్ వయలెన్స్ యాక్ట్, మోటారు వాహనాల చట్టం, బాలకార్మిక నిర్మూలన చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, జువైనెల్ జస్టిస్ యాక్ట్, ఉచిత న్యాయసేవా సహాయంపై న్యాయమూర్తి వివరించారు. చిన్న చిన్న సమస్యలు ఎదురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రజలు చట్టాన్ని,న్యాయాన్ని గౌరవిస్తూ ముందుకు సాగాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు కానవస్తే 1098 ద్వార సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సోమశేఖర్, జగన్, తుల్జారాం, జనార్ధన్, శివకుమార్, లీగల్ సర్వీసెస్, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## 2న హైదరాబాద్‌లో బిజెపి ఒబిసి ఆధ్వర్యంలో నిరసన

### రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్‌గౌడ్

**నర్సాపూర్, జూలై 31, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలను మోసం చేసిందని ఇందుకు నిరసనగా ఆగస్టు 2న బిజెపి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో హైదరాబాదులో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాప గారి రమేష్ గౌడ్ తెలిపారు. గురువారం నాడాయన నర్సాపూర్ లో విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని మభ్యపెట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ లబ్ధి పొందాలని చూస్తుందన్నారు. బీసీలను మోసం చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పై బిజెపి ఓబీసీ ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.నిరసన కార్యక్రమానికి బిజెపి నాయకులతో పాటు కార్యకర్తలు బీసీ సంఘం నాయకులు బీసీలు అత్యధిక సంఖ్యలో హాజరై ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి ఓ ఒబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు



పిహెచ్‌సిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

## వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**కంది, జూలై 31, ప్రభాతవార్త :** వైద్యులు, వైద్య సిబ్బంది సమయ పాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. గురువారం కందిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను, సిబ్బంది హాజరు వివరాలను, తనిఖీచేశారు. ఓపి, ఔట్‌పేషంట్‌ల సంఖ్యలపై కలెక్టర్ ఆరాతీశారు. రోగులతో కలెక్టర్ మాట్లాడారు.

**డిజిటల్ తరగతులతో విద్యార్థులకు ప్రయోజనం...**

కందిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం కలెక్టర్ ప్రావీణ్య తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మేధస్సును వెలికితీసేందుకు డిజిటల్ తరగతులు ఉపయోగపడతాయన్నారు. నూతన డైట్ విధానాన్ని అమలు చేయాలని చెప్పారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు, హాజరు శాతం పెరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



తహసీల్దార్ కార్యాలయంలో భూభారతిపై ఆరాతీస్తున్న కలెక్టర్

**చిన్నకోడూరు, జూలై 31, ప్రభాతవార్త :** ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. చిన్నకోడూరులో గురువారం ఆమె పర్యటించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పిహెచ్‌సిని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హాజరు పట్టికను పరిశీలించి అనుమతి లేనిది సెలవు మంజూరు చేయొద్దన్నారు. ల్యాబ్, స్టోర్‌రూంలో మందులను పరిశీలించారు. కాలం చెల్లిన మందులు వినియోగించొద్దన్నారు. సీజనల్ వ్యాధులపట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రులోనే వైద్యం చేయించుకొని సాధారణ ప్రసవాలు జరిగేలే ప్రోత్సహించాలని సూచించారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి త్వరగా పూర్తి చేసుకోవాలఇ చెప్పారు. తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి భూ భారతి రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను తర్వగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం పోస్టాఫీస్‌ను సందర్శించి ముఖగుర్తింపు పద్దతి ద్వారా అందజేస్తున్న పింఛన్‌ను పరిశీలించి పింఛన్‌దారులతో మాట్లాడారు. అలాగే ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాన్ని పరిశీలించి రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఎరువులు కృతిమకొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని వ్యవసాయ అధికారని ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ సలీంమియా. ఎంపిడిఓ జనార్ధన్, జిల్లా వ్యవసాయ అధికారి, వైద్యాధికారి ఐశ్వర్య, నయాబ్ తహసీల్దార్ మధుకర్, ఎంపివో సోమిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

## నెల రోజులు పోలీస్ యాక్ట్ అమలు

### -సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంజక్

**సంగారెడ్డి టౌన్, జూలై 31, ప్రభాతవార్త:** జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని ఆగస్టు 1 నుంచి 31వ తేదీవరకు ఆయా గ్రామాల్లో 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ పరితోష్‌పంజక్ పేర్కొన్నారు. పోలీసుల అనుమతులు లేకుండా ప్రజలు, ప్రజాప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగేవిధంగా, ప్రజాధనానికి నష్టం వాటిల్లే విధంగా వ్యవహరిస్తే, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకుసహకరించాలని ఎస్పీ కోరారు.

## అడిషన్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**రాయపోల్ జూలై 31ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా అడిషినల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్యకేంద్రంలోని ఉద్యోగుల హాజరు, ఓపి, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు.రోగులకు అందుతున్న సేవలు మందుల గురించి మెడికల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే రామారం లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఆమె మట్లాడుతూ..ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం చేసుకున్న ప్రతి ఒక్కరికి డబ్బులు మంజూరవుతాయన్నారు. కొంతమంది లబ్ధిదారులకు తమకు బిల్లులు రాలేదని అడిషినల్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అక్కడి నుంచే పిడి హౌసింగ్ అధికారితో మాట్లాడి పెండింగ్ బిల్లులు త్వరలో వస్తాయని వారికి తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ బాలయ్య, తహసీల్దార్ కృష్ణ మోహన్, ఎంపిఓ శ్రీనివాస్, ఎంఈఓ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



రామారంలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలిస్తున్న దృశ్యం

# మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుకుందాం

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాలో వివిధ రోడ్లపై ప్రయాణిస్తున్న ప్రతి వాహనదారుని ప్రాణాలు ముఖ్యమని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం రోడ్డు భద్రత కమిటీ, మత్తు పదార్థాల వినియోగ నివారణ తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రాజీవ్ రహదారిపై అతి ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న కొన్ని బ్లాక్ స్పాట్‌లను గుర్తించి వాటికి సంబంధించిన ఎస్టిమేట్‌వేసి అన్ని డాక్యుమెంట్లు తయారు చేసి అందించాలన్నారు. రోడ్లపై అడ్డంగా చెట్ల కొమ్మలు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని వాటిని తొలిగించాలన్నారు. వివిధ గ్రామాల నుంచి రాజీవ్ రహదారి కలిసే ప్రాంతాల్లో జీబ్రా క్రాసింగ్ ఏర్పాటుచేయాలని చెప్పారు. చౌరస్తాలలో బ్లింకింగ్ లైట్స్ అమర్చాలని హెచ్‌కెఆర్ అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట సిసి కెమెరాలు బిగించాలని తెలిపారు. ఎక్కువగా మూల మలుపులు ఉన్న ప్రాంతాలలో రోడ్డు విస్తీర్ణం పెంచేందుకు భూ సేకరణ చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలో ఎక్కువగా జనాలు సంచరించే ప్రాంతాలలో భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల అక్రమ రవాణా అరికట్టడానికి అందరు అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాపై తరచూ పర్యవేక్షణ చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల చుట్టూ 100 మీటర్ల పరిధిలోని దుకాణాల్లో పొగాకు,మత్తు పదార్థాలు విక్రయించినట్లయితే వెంటనే పోలీసు అధికారులకు సమాచారం అందించాలని డిఈవోను ఆదేశించారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా రవాణాశాఖ ఇన్‌చార్జి అధికారి లక్ష్మణ్, జిల్లా ఆర్‌టిఎ సభ్యులు డాక్టర్ లక్కరసు సూర్యచంద్రవర్మ, ఎసిపిలు రవీందర్‌రెడ్డి, సదానందం, నర్సింలు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, ఆర్‌అండ్‌బి డిఇ వెంకటేశం, డిఈవో శ్రీనివాస్‌రెడ్డి, ట్రాఫిక్ సిఐ, హైవే హెచ్‌కెఆర్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

# అమ్మ పాలు.. అమృతం..

*** తాగితే బిడ్డకు.. తాగిస్తే తల్లికి రక్ష * నేటి నుంచి 7వ తేదీవరకు తల్లిపాల వారోత్సవాలు**

**నారాయణఖేడ్, జూలై 31, ప్రభాతవార్త:** తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇంట్లో సంతోషం వెల్లివిరుస్తుందని, వారి ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుంది. ప్రతి ఏటా ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి, తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. బిడ్డకు తల్లిపాలు వరం, సురక్షితం, పౌష్టికాహారం. అన్ని పోషకాలు అందించి రోగాల నుండి రక్షించగలిగే అమృతమని వైద్యులు సూచిస్తున్నారు. పోతపాల కంటే తల్లిపాలు తాగే పిల్లలు బలంగా తెలివిగా ఉంటారనేది నిరూపితమైన వాస్తవం. శిశు సంపూర్ణ ఆరోగ్యం వజ్ర సమానమైన రోగనిరోధకశక్తిని పొందాలంటే తల్లిపాలు పట్టించాల్సిందే. పుట్టిన బిడ్డకు పాలు తాగిస్తే తల్లికి లాభాలు ఉన్నాయి. ఎన్నో రకాల వ్యాధులు రాకుండా ఉంటాయి. ఇంతటి విశిష్టత కలిగిన తల్లిపాలను బిడ్డ ఎంత వయసు వచ్చేవరకు ఇవ్వాలి, రోజుకు ఎన్నిసార్లు పట్టాలి, ఎలా పట్టాలి.. తల్లిపాలు పుష్కలంగా రావాలంటే ఏం తినాలి, ముర్రుపాలు ఎప్పుడు పట్టాలి.. ఇలా చాలా అంశాలపై అందరికీ అవగాహన ఉండదు. ఆధునికకాలం అమ్మలకు మరింత తక్కువ. అలాంటి వారికి తల్లిపాల ప్రాముఖ్యతను చాటేందుకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుండి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నారు. మొదటి అరగంటలోపు తల్లులకు వచ్చే ముర్రుపాలను కచ్చితంగా శిశువుకుపట్టాలి, శక్తిపెరగడమే కాకుండా బిడ్డకు సమతుల్యమైన పోషకపదార్థాలు అందుతాయి. ఇందులో మాంసకృత్తులు ఉంటాయి. బిడ్డ పుట్టిన మొదటి అరగంటలోపు తల్లులకు ముర్రు పాలను కచ్చితంగా శిశువుకు పట్టాలి, దీనివల్ల శక్తి పెరగడమే కాకుండా బిడ్డకు సమతుల్యమైన ఆహార పదార్థాలు అందుతాయి.ఇందులో మాంసకృత్తులు, విటమిన్ ఏ ఉంటుంది. బిడ్డ పుట్టిన గంట నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప వేరే పాలు, పదార్థం ఇవ్వకూడదు.శుభ్రంగా ఎటువంటిక్రిములు లేకుండా ఉంటాయి. శ్వాసకోశ, అలర్జీ, అస్తమా, చర్మవ్యాధులనుండి పిల్లలు రక్షించబడతాయి. బిడ్డ మానసిక శాంతి వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి. రోజులో బిడ్డకు ఎనిమిది నుంచి పది సార్లు పాలు ఇవ్వాలి. ఆరుమాసాల తర్వాత నుంచి బిడ్డకు తల్లిపాలతోపాటు అనుబంధాహారం ఇవ్వాలి. రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా తల్లి పాలు పట్టాలి. దీనివల్ల ఎలాంటి వ్యాధులు దరిచేరకుండా బిడ్డ ఎదుగుదల సక్రమంగా ఉంటుంది. తల్లిపాలు పుష్కలంగా రావాలంటే గర్భిణీగా ఉన్నప్పటినుంచే పోషకవిలువలు ఉన్న ఆహారం, పాలు, చేపలు, గుడ్లు, తాజాకూరగాయలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలి. తల్లిపాలు శిశువుకు సమతుల్యమైన, సంతులిత ఆహారాన్ని అందిస్తాయి. నాణ్యమైన ప్రోటీన్లు ఒమేగా 3,6,9 బిడ్డ మెదడుకు వికాసానికి తోడ్పడతాయి. పాలలో విటమిన్‌లు పుష్కలంగా ఉంటాయి. ఇందులోనే లాక్‌జోన్ వల్ల కాలుష్యం నిలువలు పెరుగుతాయి. బిడ్డను రక్తం నుంచి కాపాడతాయి. తొలి నెలలో శిశువుకు వివిధ రకాల అంటువ్యాధుల బారినుండి కాపాడతాయి. మృదువైన మలవిసర్జన, మలబద్ధకం సమస్య నివారణకు తోడ్పడతాయి. జీర్ణమండలాన్ని వృద్ధి చేస్తాయి. తల్లిపాల ద్వారా బిడ్డలకు డయేరియా, నిమోనియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు. క్యాన్సర్, చెవికి సంబంధించిన వ్యాధులు గుండెజబ్బులు వంటి వ్యాధులు నుండి కూడా రక్షణ కల్పిస్తాయి. ఆస్తమావంటి వ్యాధులు రావు. బాల్యం, యవ్వనంలో ఊబకాయం వచ్చే ప్రమాదం తక్కువ. తల్లులు చనుబాలు ఇవ్వడం వల్ల గర్భధారణ తర్వాత రక్తస్రావ ప్రమాదం తగ్గడంతోపాటు త్వరగా కోలుకుంటారు. జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారు. చనుబాలు ఇచ్చినందు వల్ల ఊబకాయం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. గర్భానికి పూర్వం ఉన్న బరువును తిరిగి పొందుతారు. బిడ్డకు పాలు పట్టించడం వల్ల రొమ్ము గర్భసంచి క్యాన్సర్ రావు. తల్లులకు మళ్లీ వయసు లో వచ్చే ఆస్టియోపోరోసిస్ ఎముకల బలహీనతల నుంచి కాపాడుతుంది. తల్లీ శిశువులమధ్య బంధాన్ని పెంపొందిస్తుంది. తల్లికి, శిశువుకి జ్వరం వచ్చినప్పుడు టీకాలు ఇచ్చినప్పుడు పాలు పట్టించవచ్చు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో 16సెక్టార్లలో 404అంగన్ వాడీకేంద్రాలు నడుస్తు న్నాయి. కొత్త ప్రభుత్వం మరింత పోషకాహారం అందించాలనే ఆలోచనతో నూతన విధానాన్ని అనుసరిస్తుంది. గత ప్రభుత్వంలో బాలింతలకు గుడ్లు పంపిణీ చేయగా, ప్రస్తుత ప్రభుత్వం ఎగ్ బిర్యానీ అందిస్తుంది. అమృతతుల్యమైన ఆహారం అందించడానికి వివిధకార్యక్రమాలు చేపట్టి అవగా హన కల్పిస్తున్నారు.

**ప్రతి ఏటా వారోత్సవాలు నిర్వహిస్తాం..**

**-లలితకుమారి, ఐసిడిఎస్ సంక్షేమశాఖ అధికారి**

ప్రతిసంవత్సరం తల్లిపాల వారోత్సవాలను ఆగస్టు 1 తేదీ నుండి 8వ తారీకు వరకు వారం రోజుల పాటు నిర్వహించడం జరుగుతుంది. అమ్మ పాల విశిష్టతను తెలిపేలా అవగాహనా సమావేశాలు నిర్వహిస్తాం. గర్భిణీలు, బాలింతలు తల్లి పాల విశిష్టతను తప్పకుండా తెలుసుకోవాలి. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడంవల్ల పిల్లలతో పాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పుట్టినప్పటి నుండి శిశువులకు తల్లిపాలని అందించాలి. తల్లిపాలు ముద్దు, ప్యాకెట్ వద్దు అని నినాదం అధికారులు తెలపాలన్నారు.

## కృష్ణంరాజు కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి

**చౌటకూరు, జూలై 31, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వన్నాపూర్ గ్రామానికి చెందిన దళిత నాయకులు కృష్ణంరాజు ఇటీవల మృతి చెందినట్లు తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా, మంత్రి తనయ త్రిష దామోదర్‌లు గురువారం కృష్ణం రాజు నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు కృష్ణంరాజు తనయుడి చదువు భాధ్యత తనదేనని, కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు నత్తి దశరథ్, ఉపాధ్యక్షుఉ రామగౌడ్, ఆత్మ కమిటి చైర్మన్ మల్లారెడ్డి, నాయకులు ఈశ్వర్‌గౌడ్, రామచంద్రారెడ్డి, పత్తి రాములు, శ్రీహరి ఒన్నపూర్ కాంగ్రెస్ నాయకులు మొగులయ్య, నాయకులు మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి మల్లికార్జున్‌గౌడ్, మౌలానా, కాశీనాథ్, గొల్ల మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, చెన్నంరెడ్డి, వర్కల రమేష్, కైసర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

### అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి
### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**అల్లాదుర్గం, జూలై 31, ప్రభాతవార్త:** ప్రజల ఆరోగ్యంపై శ్రద్ద వహించాలని ఆసుపత్రి వైద్యులకు, సిబ్బందికి మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. గురువారం మండల పరిధిలోని గడిపెద్దాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ముస్లాపూర్ గ్రామంలో నిర్మాణంలోఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు.

ఆసుపత్రిలోని స్టోర్, రక్తపరీక్ష గది, ఓపి రిజిస్టర్ లను కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు. జ్వరాలు ప్రబలిన ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ముస్లాపూర్ గ్రామంలో నిర్మాణంలోఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్దిదారులకు పలు సూచనలు చేశారు. పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ద వహించాలని, ఫ్రేడే డ్రైడేను అమలు చేయాలని ఆదేశించారు. గ్రామంలోని ఫర్టిలైజర్ దుకాణాన్ని పరిశీలించి డీలర్ నిబంధనలను పాటించాలన్నారు.

విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు విధిగా రశీధులు అందచేయాలని, రశీదులు అందుకున్న రైతుల పంట చేతికి అందేవరకు రశీదులను భద్రపర్చుకోవాలన్నారు. ఎరువుల దుకాణంలో స్టాక్ వివరాలు, బోర్డుపై ప్రదర్శించిన వివరాలు, ధరల పట్టికను పరిశీలించారు. పట్టాలేని రైతులకు ఆధార్ ఆధారంగా అవసరం మేరకు యూరియాను అందివ్వాలన్నారు. ఎరువుల కొరత సృష్టించినా, ఎరువులను దారి మళ్లించినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్ప వని హెచ్చరించారు. జిల్లాలో పశుసంపద ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించేందుకు ముస్లాపూర్ పశువుల ఆసుపత్రిని తనిఖీ చేశారు.ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందుల స్టాక్, వ్యాక్సిన్ నిల్వలు తదితర వాటిని కలెక్టర్ పరిశీలించారు. పశువులకు అందించాల్సిన టీకాలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణతో పాటు రైతుల ఆర్థికాభివృద్ధికి తమ వంతు సహకారం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ లింగప్ప, ఏపిఓ సుధాకర్, టిఎలు జ్యోతి, రాహుల్, పంచాయితీ కార్యదర్శులు నాగరాజు, గృహనిర్మాణ ఏఈ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.



ముస్లాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న పట్టుపరిశ్రమ జాయింట్ డైరెక్టర్ లత

## పట్టును ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలి

### పట్టుపరిశ్రమ జాయింట్ డైరెక్టర్ లత

**చిన్నకోడూరు, జూలై 31,ప్రభాతవార్త :** పట్టును విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని ప్రభుత్వం భావిస్తుందని పట్టు పరిశ్రమశాఖ జాయింట్ డైరెక్టర్, రాష్ట్ర నోడల్ ఆఫీసర్ లత అన్నారు. మా పట్టు మా అభిమాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని చంద్లాపూర్‌లో ఏర్పాటు చేసిన పట్టు రైతుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సెంట్రల్ సిల్క్ బోర్డు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పట్టును విదేశాలకు ఎగుమతి చేయాలంటే ఇక్కడ ఉత్పత్తి పెరగాలన్నారు. రైతులు పట్టును సాగు చేయడానికి ముందుకు రావాలన్నారు.పట్టు సాగుపై ప్రభుత్వాలు సబ్సిడిలు అందిస్తుందన్నారు. సేంద్రీయ ఎరువులతో మల్బరీ తోట సాగు చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు.శాస్త్రవేత్తలు వినోద్‌కుమార్, రాఘవేంద్ర, అసిస్టెంట్ డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి తదితరులు మాట్లాడారు.కార్యక్రమంలో పట్టు పరిశ్రమ అధికారులు రేణుశర్మ, రైతు సంఘం గౌరవాధ్యక్షులు పెద్దోళ్ల నరసింహులు, జిల్లా అధ్యక్షులు ఐలయ్య, రైతులు పిల్లి శ్రీనివాస్, నర్సింలు, మహేష్,చ ప్రవీణ్,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఎపిఎం గౌరీశంకర్ చిలిపిచెడ్ మండలానికి బదిలీ

**నర్సాపూర్ జూలై 31, ప్రభాతవార్త:** నర్సాపూర్ మండల సమైక్య ఎపీఎంగా పనిచేసిన మార్గం గౌరీ శంకర్ చిలిపి చెడ్ మండలానికి బదిలీపై వెళ్లినట్లు తెలిసింది. ఈ సందర్భంగా గురువారం గౌరీ శంకర్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా నర్సాపూర్ మండల ఏపీఎంగా బాధ్యతలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. మహిళా సంఘాల అభివృద్ధిలో నర్సాపూర్ ను రాష్ట్రం, జిల్లా స్థాయిలో నిల్పడం జరిగిందన్నారు. ఇన్నాళ్లు తనకు సహకారం అందించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## భార్యను చంపిన కేసులో భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష

### సిపి డాక్టర్ అనురాధ

**చిన్నకోడూరు, జూలై 31, ప్రభాతవార్త :** భార్యను చంపిన భర్తకు యావజ్జీవ జైలుశిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సాయిరమాదేవి తీర్పునిచ్చినట్లు సీపీ డాక్టర్ అనురాధ గురువారం తెలిపారు. కర్ణాటక రాయచూర్‌కు చెందిన గట్టు వీరేష్‌రెడ్డి చెల్లెలు ఇందిరను చిన్నకోడూరు మండలం విఠలాపూర్ గ్రామానికి చెందిన గంగసాని శ్రీనివాస్‌రెడ్డికి కట్నకానుకలు ఇచ్చి ఘనంగా వివాహం జరిపించినట్లు తెలిపారు. అనంతరం కొన్ని రోజులు సంసారం సాఫీగానే సాగిందని ఈ క్రమంలో భర్త అత్తమామలు, ఆడపడుచులు అదనపు కట్నం కోసం మానసికంగా,శారీరకంగా వేధించారని తెలిపారు. 2019 ఎప్రిల్‌లో అదనపు కట్నం రూ.10 వేలు కావాలని ఇందిరను వేధించారని తెలిపారు. అదే నెలలో 10న ఇందిరా చనిపోయిందన్నారు. బాధిత కుటుంబీకులు విఠలాపూర్‌కు చేరుకొని ఇందిరా మృతదేహాన్ని పరిశీలించగా భర్త గంగసాని శ్రీనివాస్‌రెడ్డి గొంతు పిసికి తన చెల్లెలను చంపాడని ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించి నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు పరిశోధన పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖాలు చేసినట్లు సీపీ వివరించారు. ఆరోజు నుంచి నేటి వరకు జిల్లా ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ కోర్టులో కేసు విచారణ జరిగిందన్నారు. ఇరువురి వాదనలు విన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సాయిరమాదేవి నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు వివరించారు. నేరస్థునికి జైలు శిక్ష పడడానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవన్‌రెడ్డి తన వాదనలు వినిపించారని...సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, కోర్టు కానిస్టేబుల్ రవి, కోర్టు లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి, కీలక పాత్ర పోషించారని తెలిపారు. కేసు పరిశోధన చేసిన పోలీసు అధికారులు శ్రీను, బాలకృష్ణ, సైఫ్ అలీ, కానిస్టేబుళ్లు రవి, శ్రీనివాస్‌రెడ్డిలను అభినందించి త్వరలో రివార్డు అందజేస్తామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

**చిన్నశంకరంపేట, జూలై 31,ప్రభాతవార్త:** రోడ్డుప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్రగాయాలైన సంఘటన మండల పరిధి ఖాజాపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఖాజాపూర్ తండాకు చెందిన రమేష్,జీవన్, సుధాకర్‌లు ద్విచక్రవాహనంపై మెదక్ వైపునకు వెళ్తుండగా ఖాజాపూర్ శివారు వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి ముందు వెళ్తున్న టాటాఎసి వాహనాన్ని బలంగా ఢీకొట్టారు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో రమేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెడ్చల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తలరించారు. మిగతా ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా వారిని మెదక్‌లోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

## నాలుగు టిప్పర్ వాహనాలు సీజ్

**బెజ్జంకి, జూలై 31, ప్రభాతవార్త :** అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి, ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ చంద్రశేఖర్ హెచ్చరించారు. గురువారం కోహెడ మండలంలోని రామచంద్రాపురం గ్రామం నుంచి ఇందిరమ్మ ఇళ్ల పేరుతో మండల కేంద్రానికి అక్రమంగా మట్టిని రవాణా చేస్తున్న నాలుగు టిప్పర్ వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన వాహనాలను పోలీసులకు అప్పగించినట్లు వివరించారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పనుల పేరుతో లేదా ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక, మట్టి అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు.

## గంజాయి సాగుచేసిన వ్యక్తికి ఐదేళ్ల జైలుశిక్ష

### రూ.2 వేలు జరిమానా

**మునిపల్లి, జూలై 31 (ప్రభాతవార్త):** అక్రమంగా గంజాయి సాగు చేసిన వ్యక్తికి 5 సంవత్సరాల జైలు శిక్ష, 25 వేల రూపాయల జరిమానా విధిస్తూ సంగారెడ్డి మొదటి అదనపు జిల్లా న్యాయ మూర్తి తీర్పు విధించినట్లు ఎక్సైజ్ సీఐ నజీర్ పాషా తెలిపారు. మునిపల్లికి చెందిన మన్నె రాములు పెద్దలోని గ్రామంలో 2022 సంవత్సరంలో గంజాయి సాగుచేస్తుండగా అధికారులు దాడిచేసి 36 మొక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గురువారం మొదటి అదనపు జిల్లా న్యాయ మూర్తి తీర్పు వెల్లడించినట్లు ఎక్సైజ్ సీఐ నజీర్ పాషా పేర్కొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన అంబర్‌పేట్ గౌడసంఘం



బాధ్యతలు స్వీకరిస్తున్న అంబర్‌పేట్ గౌడ సంఘం నూతన కమిటీ సభ్యులు,చిత్రంలో తోటకూరి కృష్ణగౌడ్, బత్తిని రవీందర్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, జులై 31 ప్రభాతవార్త:** గౌడ సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అంబర్‌పేట్ గౌడ సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గౌడ సంఘం చైర్మన్ బత్తిని రవీందర్ గౌడ్ అధ్యక్షుడు పంజాల గిరిధర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి తోటకూరి కృష్ణ గౌడ్ అన్నారు. అంబర్‌పేట్ గౌడ సంఘం నూతన కమిటీ సభ్యులు తమ బాధ్యతలను గురువారం సంఘం కార్యాలయంలో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ్‌లు సామాజిక, ఆర్థికంగా, రాజకీయంగా రాణించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గౌడ కులస్తుల సమస్యలను పరిష్కారానికి తమవంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు నడిపల్లి శ్రీహరి గౌడ్, బింది మల్లికార్జున్ గౌడ్, మలక్ పేట సతీష్ ఆనంద్ గౌడ్, రుద్రగోని శ్రీధర్ గౌడ్ , సంయుక్త కార్యదర్శులు పంజాల మహేష్ గౌడ్, పంజాల వెంకటేష్ గౌడ్ , కార్యనిర్వాహణ కార్యదర్శులు రంగ ప్రదీప్ గౌడ్, మారేడ్పల్లి రోహిత్ రాజు గౌడ్, కోశాధికారి చెరుకు రమణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జనహిత పాదయాత్ర విజయవంతంకావాలి : విహెచ్



చిలుకూరి శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న మహేష్‌కుమార్‌గౌడ్, విహెచ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, జులై 31 ప్రభాతవార్త:** పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జనహిత పాదయాత్రలో పిసిసి మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన చిలుకూరి శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వి.హనుమంతరావు మాట్లాడుతూ జనహిత పాదయాత్ర విజయ వంతం కావాలని శ్రీవెంకటేశ్వరస్వామిని కోరుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీసీ ఉపాధ్యక్షులు అప్సర్ యూసుఫ్ జాయి, పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, అంబర్‌పేట్ మైనార్టీ అధ్యక్షుడు ఫరీద్ హమీద్ ఖాన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.కృష్ణయ్యను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించాలి -రవి కుమార్ యాదవ్



తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం సమావేశంలో మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రవికుమార్ యాదవ్

**హైదరాబాద్, జులై 31 ప్రభాతవార్త:** సంఘ సంస్కర్త, బీసీల జాతి కోసం 50 సంవత్సరాలు అనేక ఉద్యమాలు చేసిన బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించాలని తెలంగాణ బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రవికుమార్ యాదవ్ ఎన్డీఏ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే ఆయన బిసి సమాజానికి చేసిన సేవలను గుర్తించి పద్మశ్రీ అవార్డు కూడా ప్రకటించాలని డిమాండ్ చేశారు.గురువారం బిసి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ ఉద్యమ నేత, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీల హక్కుల సాధనకు అలు పెరుగని పోరాటం చేస్తున్న యోధుడు కృష్ణయ్య అని ఆయన పేర్కొన్నారు. ఆర్.కృష్ణయ్యను పార్టీలకు అతీతంగా ఉపరాష్ట్రపతిగా ఎన్నుకుంటే బీసీలకు సముచిత స్థానం కల్పించడంతో పాటు తెలంగాణకు తగిన గుర్తింపు వస్తుందన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఉపరాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు ఎన్నికయ్యారని,ఈసారి తెలంగాణకు ఆఅవకాశం ఇవ్వాలని కోరారు.

## తెలుగు సాహిత్యంలో సుస్థిరస్థానం సంపాదించిన వ్యక్తి బాలాంత్రపు వేంకటరమణ : కెవి.రమణాచారి



'కిన్నెర-సినారె సాహితీ పురస్కారం-2025'ను బాలాంత్రపు వేంకటరమణకు ప్రదానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, జులై 31 ప్రభాతవార్త:** బాలాంత్రపు వేంకటరమణ తెలుగు సాహిత్యంలో సుస్థిరస్థానం సంపాదించారని ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి. రమణాచారి అన్నారు. గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ్ పురస్కారగ్రహీత, డాక్టర్ సి.నారాయణరెడ్డి 94వ జయంతి సందర్భంగా 'ప్రబంధ సాహిత్య విశ్లేషకుడు బాలాంత్రపు వేంకటరమణకు 'కిన్నెర-సినారె సాహితీ పురస్కారం-2025' ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వాహక సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్ ఆధ్వర్యంలో జరిగింది. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కె.వి.రమణాచారి హాజరై పురస్కారాన్ని ప్రదానం చేసి ప్రసంగించారు. మనుచరిత్రము"తో సహా అనేక కావ్యాలకు పరిచయాలు రాశారన్నారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, కవి, నారుమంచి వేంకట అనంతలక్ష్మి, తెలంగాణ సారస్వత పరిషత్ కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సినారె సినీ సంగీత విభావరి అద్భుతంగా సాగింది. ఇందులలో గాయనీ గాయకులు ఆమని, చంద్రతేజ, సుభాష్ గానం చేశారు.

## డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే ఇక జైలుకే

**చిక్కడపల్లి, జులై 31 ప్రభాతవార్త:** డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపితే ఇక జైలుకేనని బేగంపేట టిటిఐ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ అన్నారు. గురువారం చిక్కడపల్లి అరోరా డిగ్రీ పీజీ కళాశాల విద్యార్థులకు రోడ్డుభద్రతపై అవగాహన కల్పించే కార్యక్రమం చిక్కడపల్లి ట్రాఫిక్‌పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ వీరేశం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నాగుల అశోక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలనిలని, ప్రమాదాలు ఉచితం కానీ అవయవాలు ఉచితం కాదని, వాహనాలు ఎప్పుడు కూడా నిరక్ష్యంగా నడపరాదని,రోడ్డు భద్రత నియమాలను అందరూ తప్పకుండా పాటించాలని యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

# సిఎం రమేష్ వ్యాఖ్యలపై కెటిఆర్ క్లారిటీ ఇవ్వాలి




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న శంకర్‌రావు, సుబ్బారావు రాణి తదితరులు

**హైదరాబాద్, జులై 31,ప్రభాతవార్త:** గత పది రోజుల క్రితం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కమ్మ సామాజిక వర్గాన్ని అవమానపరిచేలా వ్యాఖ్యలు చేయసాడంటూ ఎంపీ సీఎం రమేష్ బహిరంగ ప్రకటనపై కేటీఆర్ క్లారిటీ ఇవ్వాలని తెలంగాణ కమ్మ సంఘాల సమైక్య డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌ల ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమైక్య సభ్యులు రవి శంకర్ రావు, సుబ్బారావు, ఉప్పలపాటి రాణిలు మాట్లాడారు.. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 60 కమ్మ సంఘాలలో 25 లక్షల జనాభా ఉన్నారని తెలిపారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు అన్ని రాజకీయ పార్టీలలో తమ వంతు ప్రాతినిధ్యం వహిస్తున్నారని అన్నారు. అలాంటి కమ్మ సామాజిక వర్గ వ్యక్తులను అవమానించే విధంగా కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశాడని తన వద్ద సిసి కెమెరాల లో రికార్డ్ అయిన ఆధారాలు ఉన్నాయని సీఎం రమేష్ బహిరంగ ప్రకటన చేయడం. దీనిపై కేటీఆర్ స్పందించకపోవడం చాలా బాధాకరమని అన్నారు. వెంటనే దీనిపై కేటీఆర్ స్పందించి స్పష్టత ఇవ్వాలని లేనిపక్షంలో కేటీఆర్ నిజంగానే వ్యాఖ్యలు చేశాడని తమ సామాజిక వర్గం నమ్మవలసి వస్తుందని అన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు అరెస్ట్ అయిన సమయంలో కూడా కేటీఆర్ ఇలానే వ్యాఖ్యలు చేశాడని సామాజిక వర్గాల జోలికి వస్తే ఎంతటి వారైనా ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమైక్య సభ్యులు కంచర్ల గోపాలకృష్ణ, దిలీప్ చౌదరి పాల్గొన్నారు.

## 3న వేలాది మంది వైశ్యులతో 'వైశ్య రాజకీయ రణభేరి' : సత్యనారాయణ గుప్తా



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డా.కాచం సత్యనారాయణగుప్తా

**సైఫాబాద్, జులై 31 ప్రభాతవార్త:** జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు వాటా కల్పించాలని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డా.కాచం సత్యనారాయణగుప్తా డిమాండ్ చేశారు. 'మేము ఎంతో మా కంత' అనే నినాదంతో ఆగస్టు 3వ తేదీన నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వేలాది మందితో 'వైశ్య రాజకీయ రణభేరి' నిర్వహిస్తున్నామని చెప్పారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ రణభేరికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను కాచం ఆవిష్కరించి మాట్లాడారు. ఈ రణభేరి కార్యక్రమానికి ఆర్య వైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోప), ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి (ఎసిపిఎస్) సంపూర్ణంగా మద్దతు తెలపడం అభినందనీయమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు 30 ఎంపిపిలు, 30 జెడ్‌పిటిసిలు, 1 జెడ్‌పి ఛైర్మన్, ఒక మేయర్, 15 మున్సిపల్ ఛైర్మన్ స్థానాలలో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు వర్గీకరణ చేయాలని, వైశ్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, కుల గణన నివేదికలో అగ్రవర్ణాల వివరాలను కులాల వారిగా ప్రకటించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే నామినేటేడ్ పదవుల్లో వైశ్యులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని, స్కిల్ విశ్వ విద్యాలయాల్లో వైశ్యులకు 25 శాతం సీట్లు కేటాయించాలని కోరారు. విదేశీ విద్య సహాయ నిధిని ఏర్పాటు చేసి వైశ్య విద్యార్థులకు తోడ్పాటును అందించాలని, వైశ్య బంధును ప్రారంభించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఇండస్ట్రీయల్ కారిడార్లలో వైశ్య పారిశ్రామిక వేత్తలకు 25 శాతం కేటాయించాలని కాచం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు నమశ్శివాయ, ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి అధ్యక్షుడు ప్రేమ్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## దత్తాత్రేయ జీవితం అందరికీ ఆదర్శప్రాయం : బండాప్రకాష్




బండారు దత్తాత్రేయను అవార్డుతో సత్కరిస్తున్న ప్రకాష్, వకుళాభరణం, దైవజ్ఞశర్మ, అరవింద్‌కుమార్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, వెంకటేష్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, జులై 31 ప్రభాతవార్త :** నిజజీవితం, రాజకీయాల్లో మానవతా విలువలకు, భారతీయ సంప్రదాయ వసుధైక కుటుంబానికి నిదర్శనంగా నిలిచి కేంద్ర మాజీమంత్రి, హర్యానా రాష్ట్ర పూర్వ గవర్నరు బండారు దత్తాత్రేయ అజాతశత్రువు అని ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమని తెలంగాణ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ డా. బండా ప్రకాష్ అన్నారు. హైదరాబాద్ నగరంలో ప్రతీయేటా ఆషాడబోనాలు ముగిసిన తర్వాత శ్రీ మహాకాళి మహేష్‌గౌడ్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు అధ్యక్షుడు జి.అరవింద్‌కుమార్ గౌడ్ నిర్వహించే కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు సభాధ్యక్షతన జరిగిన ప్రతిష్టాత్మక మహాకాళి మహేష్‌గౌడ్ బోనాల పురస్కారం-2025 ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన డా. బండాప్రకాష్ విశిష్ట అతిథులు జి.నిరంజన్, దాసోజు శ్రవణ్, మాజీమంత్రి డా. వి.శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ తదితరులతో కలిసి సీనియర్ రాజకీయనాయకుడు, కేంద్ర మాజీమంత్రి, హర్యానా రాష్ట్ర పూర్వ గవర్నరు బండారు దత్తాత్రేయను ఘనంగా సత్కరించి మహాకాళి మహేష్ అవార్డును ప్రదానంచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ పాతబస్తీలో పుట్టిపెరిగిన తనకు ఈ పురస్కారం మరచిపోలేని గొప్ప అనుభూతినిచ్చిందని తెలిపారు. బోనాలు ఆడపిల్లల, స్త్రీమూర్తులకు అర్పించే భక్తితో కూడిన పండుగని, మన సంస్కృతిలో ఆడపిల్లల గౌరవాన్ని ప్రతిబింబించే ప్రత్యేక పండుగని అన్నారు. మహిళలను గౌరవించడం తన సంప్రదాయమని, ప్రజల ప్రేమే తనకు పెద్ద బహుమతి అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జోగిని నిషాక్రాంతి, మారుతి యాదవ్, గోపిశెట్టి రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉత్తమ పాత్రికేయులకు, ఉత్తమ అధికారులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమ సమన్వయకర్తలుగా ప్రవీణ్‌కుమార్, కె.వెంకటేశ్‌లు వ్యవహరించారు. సభకుముందు ప్రదర్శింపబడిన బోనాల నృత్యరూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచి వీక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది.

## తెలుగు పాట ఉన్నంతకాలం హృదయాల్లో చిరస్థాయిగా డాక్టర్ సినారె

**-విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి**



ప్రముఖ గాయకుడు డి.ఎ.మిత్రకు 'సినారె సినీ సంగీత పురస్కారం-2025' ప్రదానం చేస్తున్న న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి

**చిక్కడపల్లి, జులై 31 ప్రభాతవార్త:** తెలుగు పాట ఉన్నంతకాలంలో డాక్టర్ సినారె ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ జి.రాధారాణి అన్నారు. వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, సుశీలా నారాయణరెడ్డి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జ్ఞానపీఠ పురస్కారగ్రహీత, పద్మభూషణ్, పూర్వ రాజ్యసభ సభ్యులు డాక్టర్ సి.నారాయణరెడ్డి 94వ జన్మదినోత్సవం సందర్భంగా ప్రముఖ గాయకుడు డి.ఎ.మిత్రకు 'సినారె సినీ సంగీత పురస్కారం-2025' ప్రదానోత్సవ సభ నిర్వాహక సంస్థ అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు ఆధ్వర్యంలో జరిగింది. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ రాధారాణి పురస్కారాన్ని ప్రదానం చేసి ప్రసంగించారు. తెలుగు భాష నేటికి సజీవంగా ఉజ్వలంగా ప్రజ్వలిస్తుంది అనడానికి కారణం సినారె రచనలు కూడా తోడై ఉన్నాయన్నారు. మనిషి నీ పతాక స్థాయిలో నిలిపిన కావ్యం విశ్వంభర, సినారే ఆ కావ్య రచన తో తెలుగు భాష కీర్తి ను జాతీయ స్థాయి కి తీసుకు వెళ్లారు అని రాష్ట్ర వున్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రాధా రాణి అన్నారు. తెలంగాణా సాహిత్య పరిషత్ కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య మాట్లాడుతూ నారాయణ రెడ్డి కి పాట అంటే ప్రాణం అన్నారు ఇక పై పాటలను గానం చేసే వారికి సుశీల నారాయణ రెడ్డి ట్రస్ట్ పక్షన వంశీ సంస్థతో కలసి ప్రతి ఏటా నగదు పురస్కారం అందిస్తామనీ ప్రకటించారు. కార్యక్రమంలో విశ్రాంత రవాణా శాఖ ఉన్నతాధికారి సిఎల్ ఎన్.గాంధీ, తెలంగాణ సారస్వత పరిషత్ కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, ప్రసారభారతీయులు వరప్రసాద్ రావు, నిర్వాహక సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ తెన్నేటి సుధాదేవి, మేనేజింగ్ ట్రస్టీ శైలజ సుంకరపల్లి తదితరులు పాల్గొన్నారు. సినీ సంగీత విభావరికి సూర్యతేజ, శివరామ్‌రెడ్డి, మోహన్ వాద్యసహకారాన్ని అందించారు.

## సిసి కెమేరాలకు మరమ్మతు చేయించాలని కమిషనర్‌కు వినతి



మణికొండలో పాడైపోయిన సీసీ కెమెరాలకు మరమ్మత్తులు చేయించాలని కమీషనర్ ప్రదీప్ కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**నార్సింగి, జులై 31 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీలో కోట్ల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకార ప్రాయంగా మారాయని, పాడైపోయిన వాటికి వెంటనే మరమ్మత్తులు చేయించాలని కోరుతూ బిఆర్ఎస్ నాయకులు గురువారం కమీషనర్ ప్రదీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు సంగం శ్రీకాంత్, సీనియర్ నేతలు అందె లక్ష్మణ్‌రావ్‌లు మాట్లాడుతూ కోటి.20.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వాహణ లోపం కారణంగా పాడైపోయాయని, వెంటనే వాటిని బాగు చేయించాలని కమీషనర్‌ను కోరామన్నారు. సీసీ కెమెరాలు ఎక్కడుంటే అక్కడ దొంగతనాలు, దోపిడీలు, అసాంఘిక కార్యకలాపాలు తగ్గిన సంఘటనలు చాలా ఉన్నాయని, మణికొండలో సీసీ కెమెరాలు పెట్టిన అధికారులు వాటిని పట్టించుకోకపోవడంతో అవి పాడైపోయాయన్నారు. ఇటీవల వేణుగోపాల్ తన ఇద్దరు పిల్లలను పాఠశాలలో వదిలేందుకు వెళ్తుండగా ఆటో ఢీకొని తీవ్రంగ గాయపడ్డారు. మూడు రోజుల క్రితం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పైప్‌లైన్ రోడ్డులో ప్రమాదం జరిగి మరణించింది. ఈ రెండు సంఘటనలు జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలున్నాయని, కానీ అవి పని చేయడం లేదని, అలంకార ప్రాయంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ పుటేజిలు లభించి ఉంటే నిందితులకు కఠినమైన శిక్షలు పడే అవకాశం ఉండేదని పోలీసులు పేర్కొన్నారు. వెంటనే సీసీ కెమెరాలు పని చేసేలా చేయాలని కమీషనర్‌ను కోరామని తెలిపారు. ఈ విషయం నా దృష్టికి రాలేదని, పరిశీలంచి సీసీ కెమెరాలను బాగు చేయిస్తామని తెలిపారు. కమీషణర్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో బిఆర్ఎస్ నాయకులు కందాడ ప్రవీణ్, తిరుపతి, కిరణ్, బాబురావ్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆటల వలన సంపూర్ణ ఆరోగ్యం : కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి



వట్టినాగులపల్లిలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌లో బ్యాటింగ్ చేస్తున్న నార్సింగి మున్సిపల్ కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి.

**నార్సింగి, జులై 31 ప్రభాతవార్త :** క్రమం తప్పకుండా ఆటలు ఆడడం వలన సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని నార్సింగి మున్సిపల్ కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నార్సింగి మున్సిపల్ పరిధిలోని వట్టినాగులపల్లిలో ఉన్న మైదానంలో వంద రోజుల ప్రణాలికలో భాగంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది "క్రికెట్ టోర్నమెంట్"ను ఏర్పాటు చేసి క్రికెట్ ఆడారు. నాలుగు జట్లలో మేనేజర్ నాగేంద్రబాబు, డీఈ నరేష్ కుమార్ జట్లు ఫైనల్లో గెలుపు కోసం హోరాహోరీగా తలపడ్డాయి. మెరుగైన ప్రతిభను కనబర్చిన నాగేంద్రబాబు జట్టు విజయం సాధించింది. మున్సిపల్ కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి సైతం క్రికెట్ షాట్లు ఆడి ఆటగాళ్లలో జోష్‌ను తీసుకు వచ్చారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆటలు మనలో ఆత్మ విశ్వాసంను పెంచుతాయని, జీవితంలో ఎదురయ్యే గెలుపు-ఓటములు, ఆటు-పోట్లు, ఒడి దుడుకులను సమానంగా తీసుకోవడం, ఎదుర్కొని నిలబడడంను అలవాటు చేస్తాయని తెలిపారు. ఒంటరిగా ప్రత్యర్థి మైదానంలోకి వెళ్లి వారిని ఔట్ చేసి వచ్చే కబడ్డీ ఆట మనలో వీరత్వంను పెంచుతుందని వివరించారు. యాంత్రిక జీవనంకు అలవాటు పడ్డ పట్టణ ప్రజలు సరదాగా ఆటలు ఆడితే అలసటంతా పోయి ఆనందంగా ఉంటామని కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఢిల్లీలో జరిగే ధర్నాలో పాల్గొనాలని ఓబిసి ఛైర్మన్‌కు విజ్ఞప్తి



ఢిల్లీలో అనిల్ జైహింద్‌తో గుంజ శ్రీనివాస్

**సైఫాబాద్, జులై 31 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాలలో వెనుకబడిన బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయడం ద్వారానే విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో అవకాశాలు మెరుగుపడతాయని, ఇందులో అత్యంత వెనుకబడ్డ వడ్డెర సామాజిక వర్గానికి న్యాయం జరుగుతుందని అఖిల భారత వడ్డెర సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయంలో ఓబిసి జాతీయ ఛైర్మన్ డా.అనిల్ జైహింద్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా గుంజ శ్రీనివాస్ మాట్లాడుతూ బిసిల రిజర్వేషన్‌ల సాధన కోసం ఆగస్టు 5, 6, 7 తేదీలలో జంతర్ మంతర్ వద్ద టిపిసిసి, కాంగ్రెస్ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ధర్నాకు అనిల్ జైహింద్ కూడా హాజరు కావాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఓబిసి సంపూర్ణంగా మద్దతు ప్రకటించాలని కోరారు. 3రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం నుంచి నుంచే కాకుండా ఆనేక రాష్ట్రాల నుంచి వడ్డెరుల పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించేందుకు సిఎం రేవంత్‌రెడ్డితోపాటు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి వర్గం, ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మినాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గం, తీవ్రంగా కృషి చేస్తున్నదని చెప్పారు.

## క్రిస్టియన్ మైనార్టీల దాడులు అరికట్టాలి : బిషప్ ప్రిన్స్




సికింద్రాబాద్‌లో మైనార్టీ క్రిస్టియన్‌లపై దాడులకు నిరసనగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**కంటోన్మెంట్,జులై 31 ప్రభాతవార్త:** మైనార్టీ క్రిస్టియన్లపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు క్రైస్తవ సంఘాలన్నీ ఏకం కావాలని బిషప్ ప్రిన్స్,ఫాదర్ విక్టర్ లు పిలుపునిచ్చారు. ఛతీషగడ్‌లో క్రిస్టియన్ మైనార్టీ సిస్టర్ ప్రీతి మేరీ వందనా ప్రాన్సిస్‌లపై అక్రమంగా కేసులు బణా యించి అరెస్ట్ చేసి నందుకు నిరసనగా గురువారం సాయం త్రం క్రిస్టియన్ ఖ్యాత్‌లిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సికిం ద్రాబాద్ సెయింట్ ప్రాన్సిస్ స్కూల్ నుంచి ఎస్.డి. రోడ్డు,సెయింట్ మేరీ చర్చి,సంగీత్ చౌరస్తా, మదర్ థెరిసా వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. అక్రమంగా, అకారణంగా అరెస్ట్ చేసిన ప్రీతిమేరీ, వందనా ప్రాన్సిస్‌లను తక్షణమే విడుదల చేయాలని, సిస్టర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ప్లే కార్డులు చేత బూని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలు క్రిస్టియన్ సంఘాల నేతలు ఇమానియల్, రాజ్ అలెక్స్, మైఖేల్,సిస్టర్ ఆల్ ఫోన్స్, నాన్సీ, అడ్వకేట్ జెస్సీ, కురియన్ పాల్గొన్నారు.

## రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ క్షేత్రాధికారి నాగరాజుకు వీడ్కోలు




**రవీంద్రభారతి, జులై 31 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖలో క్షేత్రాధికారిగా సుదీర్ఘకాలం అత్యుత్తమ సేవలందించి ఈరోజు ఉద్యోగ విరమణ చేసిన ఆర్. నాగరాజు దంపతులను రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో గురువారం మధ్యాహ్నం సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ చేతులమీదుగా ఘనంగా సన్మానించి సాంస్కృతిక శాఖ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికి ప్రసంగించారు. నాగరాజు తెలుగుభాష, సంస్కృతితుల పరిరక్షణ, ప్రోత్సాహానికి చేసిన నిరంతర కృషి, నిబద్ధత శాఖకు ఎంతో మంచిపేరు, విలువైనవని, పలువురికి మార్గదర్శకమన్నారు. నాగరాజు పని పట్ల అంకితభావం, అకుంటిత దీక్షను హరికృష్ణ కొనియాడుతూ ఆయన శేషజీవితం ఆరోగ్యకరం, ఆనందదమయంగా నిండునూరేళ్ల సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.రఘునందన్, డా. పి.విజయకుమార్, పి.నర్సింలు, ఆకుల రవి తదితర సాంస్కృతికశాఖ, రవీంద్రభారతి సిబ్బంది హాజరై నాగరాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

## బర్త్ డే పార్టీ పేరుతో పిలిచి అత్యాచార యత్నం

**హైదరాబాద్, జులై 31 ప్రభాతవార్త:** హైదరాబాద్‌కు చెందిన ఓ యువకుడు దారుణానికి పాల్పడ్డాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఓ యువతిని బర్త్‌డే పేరుతో తన ఇంటికి పిలిపించుకున్నాడు. ఆ తర్వాత ఆమెపై అత్యాచారం చేసేందుకు యత్నించాడు. ఈ ఘటన బాలానగర్‌లో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బాలానగర్‌కు చెందిన జే.సిద్ధా రెడ్డి(24) ఇన్‌స్టాలో యాక్టివ్‌గా ఉంటూ.. అమ్మాయిలతో నిత్యం చాటింగ్ చేసేవాడు. ఈ క్రమంలో అతనికి మణికొండకు చెందిన ఓ యువతి(25) పరిచయమైంది. ఇక ఇద్దరూ ఫోన్ నంబర్లు మార్చుకున్నారు. తరుచుగా మాట్లాడుకునేవారు. నిన్న తన బర్త్ డే ఉందని చెప్పి సిద్ధారెడ్డి.. ఆమెను తన ఇంటికి పిలిపించుకున్నాడు. అనంతరం ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ అత్యాచారం చేసేందుకు యత్నించాడు.అప్రమత్తమైన యువతి సిద్ధారెడ్డి నుంచి తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సిద్ధారెడ్డి నల్లగొండ జిల్లాకు చెందిన వాడని తేలింది. సిద్ధారెడ్డిని పోలీసులు అరెస్టు చేసి కస్టడీలోకి తీసుకున్నారు.

## రోడ్డు భద్రతపై పాఠశాల విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న టిటిఐ ఇన్స్పెక్టర్ అశోక్

**తార్నాక, జులై 31 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని, నిరక్ష్యంగా డ్రైవింగ్ చేసి ప్రాణాలు పోగొట్టుకుట్టుకోవద్దని బేగంపేట టిటిఐ ఇన్స్పెక్టర్ నాగుల అశోక్ సూచించారు. యువత విద్యార్థులు ఎల్లప్పుడూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని ఇన్స్‌పెక్టర్ పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీస్ కమీషనర్ సి.వి. ఆనంద్, ట్రాఫిక్ జాయింట్ సి.పి. జోయల్ డేవిస్ ఇతర ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు గురువారం బేగంపేట టిటిఐ ఇన్స్పెక్టర్ నాగుల అశోక్ తార్నాకలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు మరియు నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా నాగుల అశోక్ ఇన్స్పెక్టర్ టిటిఐ బేగంపేట మాట్లాడుతూ రోడ్లు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్‌లు లేదా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఉపయోగించాలన్నారు. విద్యార్థులు రోడ్డు దాటేటప్పుడు ఎల్లప్పుడూ తల్లిదండ్రులు లేదా ఇతర పెద్దల సహాయం తీసుకోవాలి రోడ్లపై ఆడకూడదు, నడవడానికి ఎల్లప్పుడూ ఫుట్‌పాత్‌ను ఉపయోగించాలని, పిల్లలు, తల్లిదండ్రులకు ఇతర పెద్దలకు ఎల్లప్పుడూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని చెప్పాలని విజ్ఞప్తి చేశారు. బస్సు, ఆటో, కారు ఎక్కేటప్పుడు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, బాగా చదువుకుని తల్లిదండ్రులు గర్వపడేలా చేయాలన్నారు.అనంతరం చిలకలగూడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ అందరు రహదారులపై ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు, ప్రిన్సిపాల్ ప్రశాంతి, బేగంపేట టిటిఐ సిబ్బంది అయాన్ కృష్ణ పాల్గొన్నారు.

## దేవరాయాంజల్ మల్లన్నకాలనీ ఫేస్ 2లో కార్డన్ సెర్చ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న లిక్కర్, గ్యాస్ సిలిండర్లు ఇతర వస్తువులు

**పేట్ బషీరాబాద్, జులై 31, ప్రభాతవార్త**

సైబరాబాద్ కమిషనరేట్ మేడ్చల్ జోన్ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దేవరాయంజల్ మల్లన్నకాలనీ ఫేస్ 2లో గురువారం రాత్రి కట్టడి ముట్టడి (కార్డన్ సెర్చ్) చేపట్టారు. ఈ తనిఖీల్లో సివిల్ పోలీస్, ఏఆర్ పోలీస్, ట్రాఫిక్, ఎస్ఓటీ, సీసీఎస్, ఉమెన్ సేఫ్టీ అందరు కలిసి 280 మందితో 620 ఇండ్లలో సోదాలు చేపట్టగా 1884 మంది వ్యక్తులను తనిఖీలు చేసినట్లు డీసీపీ కోటిరెడ్డి తెలిపారు. కాగా 37 ఏలాంటి ఆధారాలు లేకుండా ఉన్న వాహనాలు, 63 అక్రమంగా రీఫిల్లింగ్ చేస్తున్న సిలిండర్లు, 300 గుట్కా ప్యాకెట్లు, రెండు హుక్కా పాట్స్, 74 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేసి రౌడీషిటర్, ఇద్దరు సస్పెక్ట్‌లతో పాటు ఇద్దరు గంజాయి విక్రయదారులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు 332 వాహనాలను తనిఖీలు చేయగా వాటిపై రూ.2 లక్షల 44 వేలు పెండింగ్ చలాన్ల ద్వారా సుమారు 1 లక్షా 4 వేల చలాన్లను వసూలు చేసినట్లు తెలిపారు. చేపట్టిన వాహనాల తనిఖీల్లో ఈ ప్రాంతంలో అత్యధికంగా ఇతర రాష్ట్రాలైన జార్ఖండ్ నుండి 150 మంది, బీహార్‌కు చెందిన 330 మంది, ఉత్తరప్రదేశ్ నుండి 282 మంది, కర్ణాటక నుండి 180 మంది, ఒరిస్సా 175 మంది, ఇతరులు 107 కాగా స్థానికులు 400 మంది ఉన్నట్లు గుర్తించారు.

## కేంద్ర కారాగారాల్లోని డి అడిక్షన్ సెంటర్ల సిబ్బందికి శిక్షణ ప్రారంభం



శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్ర

**సైదాబాద్, జులై 31 ప్రభాతవార్త:** తెలంగాణా జైళ్ల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నాలుగు కేంద్ర కారాగారాల్లో ప్రారంభం కానున్న డి అడిక్షన్ సెంటర్లకు రిక్రూట్ అయిన సిబ్బందికి చంచల్‌గూడలోని సికా కార్యాలయంలో శిక్షణ శిబిరాన్ని జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్ర గురువారం ప్రారంభించారు. సిబ్బందికి నెల రోజుల పాటు శిక్షణను ఇవ్వనున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ నుండి ఈ కార్యక్రమానికి నిధులు అందిస్తున్నారు. శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం డిజి సౌమ్య మిశ్ర మాట్లాడుతూ తెలంగాణా జైళ్లు ఖైదీల శిక్ష కేంద్రాలుగా గాకుండా సంస్కరణ కేంద్రాలుగా ఉన్నాయని అన్నారు.కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజి ఎన్.మురళి బాబు, సికా ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం : డా.సోనియా దత్తా

**అత్తాపూర్ జులై31,ప్రభాతవార్త :** జీవితంలోని ప్రతి దశలోనూ మంచి నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరమని ప్రొఫెసర్. పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీలో పీహెచ్‌డీ ప్రొఫెసర్ డాక్టర్ సోనియా దత్తా అన్నారు.ఆమె మాట్లాడుతూ...కానీ మనం వయసు పెరిగే కొద్దీ మన అవసరాలు మారవచ్చు. వృద్ధులు ప్రత్యేక శ్రద్ధ మరియు సంరక్షణ అవసరమయ్యే ప్రత్యేకమైన సవాళ్లను ఎదుర్కోవచ్చుని దంతాలు మరియు చిగుళ్ళు వృద్ధాప్యం కావడానికి ఆయుర్వేద ప్రయోజనం కోసం డాబర్ రెడ్ పేస్ట్ వయసు పెరిగే కొద్దీ నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహజమైన మరియు సహాయక విధానాన్ని అందిస్తుందని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకుడు శేఖర్

## దివ్యాంగుల జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలి

**కొండపాక, జూలై 31, ప్రభాతవార్త :** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా దివ్యాంగులకు ఇచ్చిన హామీ నేరవేర్చకుండా విస్మరించిందని ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు దోమ్మాట చంద్రశేఖర్ మండిపడ్డారు. గురువారం కొండపాకలోని పంచాయతీ కార్యాలయం వద్ద దివ్యాంగులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అప్పటి పిసిసి అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. దివ్యాంగులకు ఎంఆర్‌పిఎస్ అండగా ఉంటుందని చెప్పారు. దివ్యాంగుల పెన్షన్ల పెంపు కోసం ఆగస్టు 3న గజ్వేల్ పట్టణంలో నిర్వహించే జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలని అయన కోరారు. సమావేశానికి ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా ఉపాధ్యక్షుడు పిస్నింటి శ్రీహరి, మల్లిగారి యాదగిరి, ముక్కపల్లి రాజు మాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో జిజ్ఞాస పెంచడానికే క్షేత్రస్థాయి పరిశీలన



క్షేత్రస్థాయిలో పక్షులు జంతువుల జీవనవిధానం పరిశీలిస్తున్న దృశ్యం

**కొండపాక, జూలై 31, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి మండల పరిధిలోని చిన్నకిష్టాపూర్ ప్రాథమిక పాఠశాల 4వ తరగతి విద్యార్థులను గురువారం పాఠ్యంశాలో భాగంగా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి జంతువులను, పక్షులను, పశువులను విద్యార్థులకు చూపించి వాటి జీవనవిధానం, ఆహరం గురించి స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ ప్రశాంత్‌గౌడ్ వివరించారు. ప్రత్యక్షంగా చూసింది చాలా కాలం విద్యార్థులకు గుర్తుంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారా విద్యార్థుల్లో పఠనాసక్తి, జిజ్ఞాస, నేర్చుకోవాలనే ఆసక్తి పెరుగుతుందని ప్రశాంత్‌గౌడ్ చెప్పారు.

## మంత్రిని విమర్శిస్తే చూస్తూ ఊరుకోం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు ఆనంద్

**సిద్దిపేట రూరల్, జూలై 31, ప్రభాతవార్త :** కార్మిక, భూగర్భ గనుల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామిని విమర్శించే కనీస నైతిక హక్కు లేదని....ఖబర్దార్ బిఆర్ఎస్ నాయకుల్లారా అంటూ కాంగ్రెస్ నాయకులు సాకి అనంద్ హెచ్చరించారు. గురువారం సిద్దిపేటలో ఆయన కౌన్సిలర్ రియాజ్, నాయకులు పయ్యావుల ఎల్లం, అలకుంట మహేందర్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదన్నారు. సిద్దిపేట జిల్లా అభివృద్దే ధ్యేయంగా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి ముందుకు సాగుతున్నారని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ప్రజల సమస్యలపై, అభివృద్ధిపై అవగాహన లేదని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. స్వర్గీయ కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి అడుగుజాడల్లో నడుచుకుంటూ ప్రజాసేవకు అంకితమవుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామిని విమర్శిస్తే ఊరుకోమని హెచ్చరించారు.

## ఎస్టీ హాస్టల్‌కు ప్రహరీగోడ నిర్మించాలి

### డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి



విద్యార్థులతో మాట్లాడుతున్న దాసరి ఏగొండస్వామి

**గజ్వేల్ టౌన్, జూలై 31 (ప్రభాతవార్త):** పట్టణంలోని ఎస్టీ హాస్టల్‌కు ప్రహరీగోడ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి అన్నారు. గురువారం ఎస్టీ హాస్టల్‌ను సందర్శించి అక్కడ సౌకర్యాలు, తదితర వాటిని పరిశీలించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్‌కు ప్రహరీ గోడ లేకపోవడంతో పాములు, పందులు, కుక్కలు, విష కీటకాలు లోనికి వస్తే విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదమని అన్నారు. పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు అవుతున్నా విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేయలేదని, మూడు నెలలుగా కాస్మోటిక్ చార్జీలు ఇవ్వలేదని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు తాజా కూరగాయలతో వండిన భోజనం పెట్టాలన్నారు. టూటర్స్‌ను నియమించి విద్యార్థులకు క్రమంతప్పకుండా ట్యూషన్ చెప్పించాలన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ గజ్వేల్ మండల అధ్యక్షుడు చంద్రం ఉన్నారు.

## పోలీసులు ప్రజలకు సేవలందించాలి: ఎస్పీ

**కొల్చారం, జూలై 31(ప్రభాతవార్త):** పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. సుదీర్ఘకాలం పోలీసు వ్యవస్థకు సేవలందించి పదవీ విరమణ పొందుతున్న ఎస్సై మహ్మద్‌గౌస్‌ను ఎస్పీ పూలమాల శాలువాతో సత్కరించి బహుమతి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎలాంటి రిమార్కులు లేకుండా సర్వీసును పూర్తి చేసి పదవీ విరమణ పొందడం అభినందనీయమన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1983వ సంవత్సరంలో మహ్మద్‌గౌస్ పోలీసు కానిస్టేబుల్‌గా అడుగుపెట్టి 42 సంవత్సరాల పాటు పోలీసు వ్యవస్థకు సేవలు అందించారన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో తనవంతు పాత్రను పోషించడం జరిగిందన్నారు. తన సర్వీసు మొత్తాన్ని ఎలాంటి రిమార్కులు లేకుండా పూర్తి చేసినందుకుగాను ప్రభుత్వం గుర్తించి సేవ, ఉత్తమ సేవా పథకాలతో గౌరవించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎస్ మహేందర్ మెదక్ డియస్పి ప్రసన్న కుమార్ తూప్రాన్ డియస్పి నరేందర్ గౌడ్ సైబర్ క్రైమ్ డియస్పి సుభాష్ చంద్ర బోస్ ఏ ఆర్ డియస్పి రంగా నాయక్ జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పొలాలకు వెంటనే విద్యుత్ సరఫరా చేయాలి

### బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

**వర్గల్, జూలై 31 (ప్రభాతవార్త):** పంట పొలాలకు నిలిపివేసిన విద్యుత్ సరఫరాను వెంటనే సరఫరా చేయాలని, వర్గల్ పారిశ్రామిక వాడలో భూములు కోల్పోయిన భూనిర్వాసితులకు అండగా బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని ఆ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వర్గల్ మండలం నగరంతండాకు చెందిన రైతులు రోడ్డుపై ఆందోళన చేపట్టగా వారికి ప్రతాప్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ చేయగా ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు అక్రమ కేసులు వేస్తూ పరిశ్రమలు రాకుండా అడ్డుకుంటున్నారని, భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం, ప్లాట్లు రాకుండా కోర్టులో కేసులు వేస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండల పరిధిలోని అవుసులోనిపల్లి గ్రామంలో ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీ మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహా, ఉత్తమ కుమార్‌రెడ్డిలు టెంట్లు వేసుకొని కూర్చొని కెసిఆర్ ప్రభుత్వం ఎకరానికి రూ.10 లక్షలు మాత్రమే ఇస్తుంది, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.50 లక్షలు పరిహారం ఇస్తామని ఉత్తర ప్రగల్భాలు పలికి రైతులు, ప్రజలను రెచ్చగొట్టి భూసేకరణను, పరిశ్రమలు రాకుండా అడ్డుకొని రైతుల నోట్లో మట్టి కొట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి వారి జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. రైతులు వరినాట్లు వేసుకొని పంటలు పండించడానికి సిద్ధం చేసుకున్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీరు అందించకపోగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడం, కనెక్షన్లు తొలగించడం చాలా దారుణమని మండిపడ్డారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతోపాటు వారికి ఇళ్లపట్టాలు, ఎకరానికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధ్యక్షుడు నాగరాజు, మాజీ సర్పంచ్‌లు కరుణాకర్, జానీ, నాయకులు రవీందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, దిలీప్, రైతులు పాల్గొన్నారు.

# లింగ సమానత్వంపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సిహెచ్ శ్రీనివాస్‌రావు

**నర్సాపూర్ రూరల్, జూలై 31, ప్రభాతవార్త:** సమాజంలో స్త్రీలు పురుషులతో పాటు సమాన హక్కులు కలిగి ఉండాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సిహెచ్ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మండల పరిధి చిన్న చింతకుంట గ్రామైక్య సంఘం కార్యాలయంలో జెండర్ అనే అంశంపై చిన్న సంగం స్థాయి, గ్రామ సంఘం స్థాయిలో మహిళలకు వచ్చిన సామాజిక సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తారు అనే అంశంపై పరిశీలన మరియు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక చిన్న సంఘంలో వచ్చిన సమస్యను ఆ సంఘంలో ఉన్న జెండర్ సఖి ద్వారా పరిష్కరించుకోవడానికి కౌన్సిలింగ్ ఇవ్వాలని, అక్కడ సాధ్యం కాకపోతే గ్రామ సంఘం స్థాయిలో ఉన్న సోషల్ యాక్షన్ కమిటీ ద్వారా పరిష్కరించాలని చివరగా మండల సమైక్య స్థాయివరకు సమస్యలు తీసుకొచ్చి సత్వరమైన పరిష్కారం మహిళలకు కానీ చిన్నపిల్లలకిగాని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించడానికి కేంద్రం నుండి వచ్చిన ఎన్ఎంఎంయూ ఆఫీసర్ నసీం ప్రత్యేకంగా సభ్యులతో సంభాషించి వివరాలు సేకరించారు. వారు చిన్న సంఘం గ్రామ సంఘం మండల సమాఖ్య స్థాయిలో సామాజిక సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై పూర్తిగా సంతృప్తిని వ్యక్తం చేశారు. సంఘంలో ఉన్న ప్రతి సభ్యురాలుకి ఏ విధమైన సామాజిక సమస్య వచ్చినా జెండర్ సఖి వెంటనే స్పందించి సత్వరమే పరిష్కారం చూపించేలా సహాయం ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ సరిత మాట్లాడుతూ మహిళలు సామాజిక అజెండాలోని అన్ని అంశాలపై చైతన్యవంతంగా పనిచేస్తూ ఆర్థిక అభివృద్ధితోపాటు సామాజిక అభివృద్ధికి కంకణ బద్దులై ఉండాలని కోరారు. లింగగౌడ్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటేష్, జిల్లా జెండర్ సభ్యులు చింతల లక్ష్మి ముక్తాబాయి, మండల సమాఖ్య అధ్యక్ష కోశాధికారులు సుమలత జ్యోతి ఏపిఎం మార్గం గౌరీశంకర్ సీసీ ప్రవీణ సిఏలు నాగరత్న లక్ష్మి గ్రామ సంఘం లీడర్లు పావని, మల్లికా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



టొబాకోకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

## టొబాకోకు వ్యతిరేకంగా విద్యార్థుల ర్యాలీ

**సిద్దిపేట అర్బన్, జూలై 31, ప్రభాతవార్త :** టొబాక్కో రహిత తరం కోసం స్కూల్ ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీ శుభోదయ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఆధ్వర్యంలో టొబాక్కో వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తంబాకు వినియోగం వలన కలిగే హానికర ప్రభావాలపై ప్లకార్డులు, పోస్టర్లు చేతబూని నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. ర్యాలీ పట్టణంలోని సునార్ గల్లీ, సుభాష్‌రోడ్డు, బురుజు, లాల్‌కమాన్ ప్రాంతాల గుండా సాగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నవీన్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి : ఎఎస్ఐ

**చిన్నశంకరంపేట, జూలై 31, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలి మండల ఏఎస్ఐ విఠల్, ఆర్ఐ రాజులు అన్నారు. గురువారం మండల పరిధి మిర్జాపల్లిలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మూఢ నమ్మకాలను నమ్మవద్దని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు, బాల కార్మిక వ్యవస్థల నిర్మూలనకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. చట్టం ముందు అందరూ సమానులే అన్నారు. భారత రాజ్యాంగ ప్రకారం ప్రతి ఒక్కరికీ హక్కులు కల్పించబడ్డాయని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు.

## పాఠశాలను పరిశీలించిన ఎంఈఓ శ్రీనివాస్

**సిర్గాపూర్, జూలై 31 ప్రభాతార్త :** మండల పరిధిలోని కడపల్ గ్రామంలోని ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలలను గురువారం మండలవిద్యాధికారి నాగారం శ్రీనివాస్ పరిశీ లించారు. పాఠశాలల్లో కొనసాగుతున్న ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపిల బోధన విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులు కష్టంతోకాకుండా ఇష్టంతో చదువు కునేలా బోధనచేయాలని సూచించారు. మధ్యాహ్నభోజనం నిర్వహణతీరు, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్న తీరుపై ఆరాతీశారు.



కడపల్ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్



ఎస్సై లక్ష్మీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

## నూతన ఎస్ఐకి సన్మానం

**గుమ్మడిదల, జూలై 31 ప్రభాతవార్త :** గుమ్మడిదల మండలం మున్సిపాలిటీ పరిధిలో బదిలీపై వచ్చిన ఎస్సై లక్ష్మీకాంత్‌రెడ్డిని గుమ్మడిదల మండల ఆర్ఎంపి, పిఎంపి అసోసియేషన్ తరపున అధ్యక్షులు పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం శాలు వాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలం మున్సిపాలిటీ పరిధిలో అన్ని గ్రామాల ప్రజల శాంతిభద్రతలకు భంగం కలగకుండా ప్రజలందరూ సహకరించాలని ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్ఎంపి, పిఎంపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బడి బాటతో పాటు....పొలం బాట

**చిన్నశంకరంపేట, జూలై 31, ప్రభాతవార్త:** విద్యార్థులకు బడి బాటతో పాటు పొలం బాటను ఉపాధ్యాయులు నేర్పిస్తున్నారు. గురువారం మండల పరిధి చందాపూర్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సాగు విధానంపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ పొలాల వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాట్లు వేయడం, సాగు చేయడం వంటి వాటి గురించి వివరించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు పొలంలో వరి నాట్లు వేశారు. ప్రధానోపాధ్యాయులు పరమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తోటవ్వలు కూడ పిల్లలో కలిసి పొలం పనులలో పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలపై పోరాటం

**గుమ్మడిదల, జూలై 31 ప్రభాతవార్త :**

అన్ని క్యాడర్లలో పదోన్నతులు కల్పించి, ఏర్పడినఖాళీలలో బదిలీలద్వారా ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలని, ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయపోస్టులు భర్తీచేయాలని, రిటైర్డ్ అయినవారికి బెనిఫిట్స్ ఇవ్వాలని, సిపియస్ విధానం రద్దుచేసి ఓపియస్ పునరుద్ధరణ చేయాలని తదితర 31డిమాండ్లతో యుఎస్‌పిసి ఆధ్వర్యంలో ఈ నెల 5న జిల్లా కేంద్రం సంగారెడ్డిలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని యుఎస్‌పిసి రాష్ట్ర నాయకులు కె.రాజారెడ్డి పిలుపునిచ్చారు. బొంతపల్లి ఉన్నత పాఠశాలలో యుఎస్‌పిసి ఉద్యమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరణ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ పెండింగ్ సమస్యలపై స్పందించాలని, ఇప్పటికే చాలాజాప్యం జరిగిందని, ఇప్పటికైనా వెంటనే ఉపాధ్యాయసమస్యలు పరిష్కారం చేయాలని, లేనిచో ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుఎస్‌పిసి నాయకులు వినోద్‌కుమార్, పోతన జ్యోతి, సుజాత, గౌసుద్దిన్, విఎస్ఎన్, రామరాజు ఉపాధ్యాయనీఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సిద్దిపేట మున్సిపాలిటీలో నిధులు దుర్వినియోగం

### బిఆర్ఎస్ నేత మణిదీప్‌రెడ్డి



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు మణిదీప్‌రెడ్డి

**సిద్దిపేట అర్బన్, జూలై 31, ప్రభాతవార్త :**

సిద్దిపేట మున్సిపాలిటీలో అవినీతి రోజురోజుకూ కరోనా వైరస్‌ను మించిపోతుందని బిఆర్ఎస్ నాయకులు ఊదర మణిదీప్‌రెడ్డి ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మంతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్ అవినీతికి అంతు లేకుండా పోతుందని ఆరోపించారు. మున్సిపల్ కౌన్సిల్ తీర్మానంలేకుండా ఇష్టానుసారంగా నిధులు దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆర్‌టిఐ చట్టం కింద మున్సిపల్ కమిషనర్ అవినీతి వివరాలను సేకరించి అవసరమైతే కోర్టుకు వెళ్లి ఆయన బాగోతాన్ని ప్రజల ముందు నిలబెడాతానని హెచ్చరించారు. ప్రజల అత్యవసర పనులకు కమిషనర్ కేవలం రూ.లక్ష ఖర్చు చేసే అధికారం ఉంటుందని కానీ ఈ కమిషనర్ ఇష్టానుసారంగా నిధులు వినియోగిస్తున్నారని తెలిపారు. అత్యవసర పనులకు రూ. లక్ష దాటితే మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేయాల్సి ఉండగా అవేమి పట్టించుకోవడం లేదన్నారు. జీవో ప్రకారం అత్యవసర పనులకు వినియోగించాల్సిన బాక్స్ టెండర్ పనులను ఇష్టారీతిగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. అశ్రిత్‌కుమార్ కమిషనర్‌గా వచ్చిన కొద్ది రోజుల్లోనే బాక్స్ టెండర్ నోటిస్‌కు చెందిన 148చెక్కులను ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. కార్యాలయంలోని తన ఛాంబర్‌ను కౌన్సిల్ తీర్మానంలేకుండా తానే రాజు తానే బంటు అన్నట్లుగా వ్యవహారిస్తూ రూ.5 లక్షలతో మరమ్మతులు చేపట్టారని ఆరోపించారు. చాంబర్ మరమ్మతులను ఒకసారి మెప్మా నిధుల నుంచి మరోసారి సొంత డబ్బులతో మరమ్మతు చేయించని దాటేవేసే ప్రయత్నంచేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్‌కు వచ్చే రెవెన్యూ ఆదాయంలోనూ కమిషనర్ చేతివాటం చూపుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ అవినీతి బాగోతంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కన్నారం గ్రామాన్ని అక్కన్నపేటలో విలీనం చేయాలి

**హుస్నాబాద్ రూరల్/ హుస్నాబాద్ టౌన్, జూలై 31, ప్రభాతవార్త**

హన్మకొండ జిల్లా వేలేరు మండలంలో కొనసాగుతున్న కన్నారం గ్రామాన్ని సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలో విలీనం చేయాలని బిఆర్ఎస్ పార్టీ నాయకుడు దప్పు నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ హయాంలో గ్రామ విలీనం అంశంపై గెజిట్ విడుదలైందని, ఆ గెజిట్‌ను ప్రస్తుత ప్రభుత్వంకాదని ప్రజల అభిప్రాయానికి విరుద్ధంగా కనీసం వెళ్లేందుకు రోడ్డు, దారిలేని వేలేరులోనే ఉంచాలని కుట్ర చేస్తున్నారన్నారు. ఈ విషయంలో త్వరలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విన్నవిస్తామని చెప్పారు. కొంతమంది రాజకీయ స్వలాభం కోసం వారికి అనుగుణంగా ఉండేలా గ్రామాన్ని వేలేరులోనే కొనసాగాలని చూస్తున్నారని, అలాచేస్తే చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. గ్రామస్థులతో కలిసి ఆందోళనలు చేయడానికి వెనుకాడమని ఆయన హెచ్చరించారు.

## నిధుల రికవరీకి ఆదేశాలు

**చిన్నకోడూరు, జూలై 31, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎల్లాయిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మహేందర్ పంచాయతీ నిధులను ఇష్టానుసారంగా డ్రాచేసి అవకతవకలకు పాల్పడడంతో రూ.65 వేలు రికవరీ చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంపై తహశీల్దార్, ఎంపిడిఓ, ఎంపిఓలకు రికవరీ ఆదేశాలు జారీ చేసిన ప్రతులను పంపించారు. గ్రామానికి చెందిన ఉడత ఎల్లయ్య సమాచార హక్కు చట్టం ద్వారా నిధుల అవకతవకలపై ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన నిధుల రికవరీకి ఆదేశించారు.

## డాక్టర్ రఘురాంరెడ్డికి ప్రొఫెసర్‌గా పదోన్నతి

**మర్కుక్, జూలై 31 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన డాక్టర్ రఘురాంరెడ్డి ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. సంగారెడ్డి మెడికల్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రఘురాంరెడ్డికి ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ ఇచ్చిన పదోన్నతులలో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు సూర్యాపేట మెడికల్ కళాశాల సర్జికల్ విభాగం హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ (హెచ్ఓడి)గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా ఈ మేరకు రఘురాంరెడ్డి సూర్యాపేట మెడికల్ కళాశాలలో పదవీ బాధ్యతలు చేపట్టారు.

## విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు, టై, బెల్టులు అందజేత

**నర్సాపూర్ జూలై 31, ప్రభాతవార్త:** పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు సొంత ఖర్చులతో స్పోర్ట్స్ డ్రెస్ టై, బెల్టులు అందించడం అభినందనీయమని మండల విద్యాధికారి తారాసింగ్ అన్నారు. గురువారం ఆద్మాపూర్ ఎంపీ యుపిఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు రవిరాజ్ విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్, టై, బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి తారాసింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు రవిరాజ్ లక్ష రూపాయలు ఖర్చు చేసి స్పోర్ట్స్ టై, బెల్టులు అందించడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తారాసింగ్ తో పాటు రెడ్డిపల్లి కాంప్లెక్స్ హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు రవిరాజ్, తిరుపతిరావు, గోపి, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటో రైటప్ :6.నర్సాపూర్ ఆర్టీసీ డిపో లో ఉత్తమ ఉద్యోగులకు అవార్డు లిచ్చి అభినందిస్తున్నఆర్ ఎం. ఎస్ వి కె మూర్తి, డిపో మేనేజర్ సురేఖ, అసిస్టెంట్ మేనేజర్ వీరబాబు, లక్ష్మన్ తదితరులు

## ఉత్తమ ఉద్యోగుల అభినందన సభ



ఉత్తమ ఉద్యోగులకు అవార్డులిచ్చి అభినందిస్తున్నఆర్ ఎంఎస్‌వికె మూర్తి

**నర్సాపూర్, జూలై 31, ప్రభాతవార్త:** ఆర్టీసీ డిపోలో ఉత్తమ ఉద్యోగుల అభినందన సభను నిర్వహించారు. అభినందన సభతో పాటు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్టిసి రీజినల్ డిప్యూటీ ఆర్ఎం. ఎస్‌వికె మూర్తి, డిపో మేనేజర్ సురేఖ, అసిస్టెంట్ మేనేజర్ వీరబాబు, నర్సాపూర్ డిపో ఇన్చార్జి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఉత్తమ ఆర్టిసి డిపోలో అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగులను ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు ఇచ్చి అభినందించారు. ఇదిలా ఉండగా ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన నరసప్పను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కండక్టర్లు డ్రైవర్లు, డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడికి ఎల్ఓసి అందజేత

**కొమురవెల్లి, జూలై 31, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రసులాబాద్ గ్రామంలో ఎండి సోహెల్‌కు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సహకారంతో రూ.3 లక్షల ఎల్ఓసి మంజూరు కావడంతో గురువారం బాధితునికి మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామిగౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా స్వామి గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఎల్ఓసి మంజూరు చేయించిన ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డికి మాజీ సర్పంచ్‌తో పాటు బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎం.డి. అబ్దుల్లా, మల్లేశం, రాములు, అరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి : ఎంఇవో

**హవేళీఘనపూర్, జూలై 31, ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మండల విద్యాధికారి మధుమోహన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎంఈఓ మధుమోహన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆదెపు కరుణాకర్ విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సు అందజేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ముందుకు సాగడం సంతోషమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఉపాధ్యాయులు, సిఆర్పి మల్లేశం విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు : ఎస్ఐ

**రాయపోల్ జూలై 31 ప్రభాతవార్త :** బాల కార్మికులతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మానస హెచ్చరించారు. గురువారం ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా రాయపోల్ మండలం రాంసాగర్‌లోని ప్రీమియం చిక్ ఫిడ్ సంస్థలో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించగా అందులో పనిచేస్తున్న ఐదుగురు బాలకార్మికులకు విముక్తి కల్పించారు. సంస్థ యజమానులు సత్యేంద్రకుమార్, సమదాన్ తాత్యాబులపై అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పాతురి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మానస తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పదవీ విరమణ పొందిన పోలీసులను సన్మానించిన ఎస్‌పి

**సంగారెడ్డి టౌన్, జూలై 31, ప్రభాతవార్త:** విధి నిర్వహణలో అంకిత భావంతో చేసిన సేవలను ప్రజలు కడదాక గుర్తించుకుంటారని జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్ అన్నారు. గురువారం సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో పదవీ విరమణ పొందిన అదనపు ఎస్సీ సంజీవరావు, ఎస్ఐ యాదవరెడ్డి, ఆర్ఎస్ఐ, అలీముద్దీన్, ఎఎస్ఐ అజీముద్దీన్‌లకు ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి పరితోష్ పంకజ్ పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వర్టికల్ డిఎస్‌పి శ్రీనివాస్‌రావు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ కళ్యాణి, ఎఆర్ డిఎస్‌పి నరేందర్, కార్యాలయ సూపరింటెండెంట్ అశోక్, మోహనప్ప, ఎస్బీ ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్ఐలు రామారావు, రాజశేఖర్, డానియెల్, పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన అధికారులను సన్మానిస్తున్న ఎస్‌పి పరితోష్

## సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



సిపిఐ జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకులు

**మునిపల్లి, జూలై 31, ప్రభాతవార్త:**
ఆగస్టు 2,3 తేదీలలో నారాయణఖేడ్‌లో నిర్వహించే సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ మండలనాయకురాలు గంగమ్మ కోరారు. గురువారం మునిపల్లి మండలంలోని బుదేరాలో సిపిఐ జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 2,3 తేదీల్లో జరిగే సిపిఐ జిల్లా 4వ మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మునిపల్లి మండలంలోని ప్రతి గ్రామం నుండి సిపిఐ నాయకులు కార్యకర్తలు, పార్టీ అభిమానులు తరలి రావాలని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లింగం, ప్రియాంక, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

-మాజీమంత్రి హరీష్‌రావు


మాజీమంత్రి హరీష్‌రావును కలిసిన ఓంప్రకాష్

**అమీన్‌పూర్, జూలై 31, ప్రభాతవార్త:**
మాజీమంత్రి హరీష్‌రావును అమీన్‌పూర్‌నివాసి ఉద్యమకారుడు, బిఆర్ఎస్ నాయకుడు, న్యాయవాది ఓంప్రకాష్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో హరీష్‌రావును కలిసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా తెలంగాణ ఉద్యమంలో మాజీ మంత్రి హరీష్‌రావుతో కలసి పాల్గొన్న ఘటనలు, ఉద్యమ రోజులను గుర్తు చేశారు. ఆప్యాయంగా పలకరించిన హరీష్‌రావు పటాన్‌చెరు నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. తెలంగాణసాధన కోసం పోరాడినట్లే, కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వ అరాచకాలు, ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. పార్టీకోసం పనిచేసే ప్రతి ఒక్కరి కష్టానికి తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఓంప్రకాష్ మాట్లాడుతూ మాజీమంత్రి హరీష్‌రావు సలహాలు సూచనలతోపాటు స్థానిక బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తల సహకారంతో బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు. ఎప్పటికప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రజలలో చైతన్యం కలిగిస్తానన్నారు. హరీష్‌రావుని కలిసినవారిలో పెద్దకంచర్ల మాజీ సర్పంచ్ రాజు, రాంప్రకాష్, గిరి, నర్సింగా తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

-మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి


యూత్ ఫర్ సేవా సంఘం సభ్యులతో కమిషనర్ జ్యోతిరెడ్డి

**అమీన్‌పూర్, జూలై 31, ప్రభాతవార్త:**
జీవకోటి మనుగడకు మొక్కలే ఆధారమని, పర్యావరణ సంరక్షణ వర్షాలు సమృద్ధిగా కురవాలని మొక్కలునాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 100రోజుల వనమహోత్సవం కార్యక్రమాన్ని అమీన్‌పూర్ మున్సిపాలిటీపరిధిలోని ఐలాపూర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ సేవా సంఘం సభ్యులు పాల్గొని భారీస్థాయిలో మొక్కలనునాటి మున్సిపాలిటీ అభివృద్ధికి తమ పాత్రను పోషించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ రెవిన్యూ ఆఫీసర్, మున్సిపల్ మేనేజర్ హాజరై మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తాముకూడా అంకితభావంతో ఉన్నారని వ్యక్తపరిచారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పచ్చదనం పెంచడం కాలుష్యనివారణ, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ఒక్కోమొక్కనాటి సంరక్షించాలని తెలిపారు. ఈవనమహోత్సవ కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు, యువత, ప్రతినిధులు విశేషంగా ఆదరించారు.

## నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

-అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాలు
-నర్సాపూర్ సిడిపిఓ హేమాభార్గవి


టీచర్లసమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఓ హేమాభార్గవి తదితరులు

**నర్సాపూర్, జూలై 31, ప్రభాతవార్త:**
ఆగస్టు 1 నుండి తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని అదేవిధంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నర్సాపూర్ సిడిపిఓ హేమాభార్గవి తెలిపారు. గురువారం నర్సాపూర్‌లోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి సిడిపిఓ హేమాభార్గవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 1వ నుండి 7వ తేదీ వరకు నర్సాపూర్ ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈమేరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించాలని పేర్కొంటూ గర్భిణులు, పాలిచ్చే తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించడం జరుగుతుందన్నారు. అంతేగాక బిడ్డ పుట్టిన మూడు రోజులపాటు వచ్చే ముర్రుపాలను ఇవ్వాలన్నారు. ఈముర్రుపాలలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని, కచ్చితంగా ముర్రుపాలను బిడ్డకు తాగించాలని, సిడిపిఓ హేమాభార్గవి సూచించారు. నర్సాపూర్ ప్రాజెక్ట్ పరిధిలోని నర్సాపూర్, కౌడిపల్లి, శివంపేట, చిలిపిచెడ్, తూప్రాన్, మనోహరాబాద్, మండలాల అంగన్‌వాడీ టీచర్లకు సెక్టార్ సమావేశాలలో సూపర్‌వైజర్‌లు పాల్గొని, ప్రతి అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ హేమాభార్గవితోపాటు నర్సాపూర్‌ప్రాజెక్ట్‌పరిధిలోని అన్ని అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# 'నమస్తే నర్సాపూర్'కు అపూర్వ స్పందన

**నర్సాపూర్ జూలై 31, ప్రభాతవార్త:**
పేద ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే నమస్తె నర్సాపూర్ కార్యక్రమం నిర్వహించామని ఈ మేరకునమస్తే నర్సాపూర్ కార్యక్రమం పై ప్రజల నుండి అపూర్వ స్పందన లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నమస్తే నర్సాపూర్ కార్యక్రమంలో భాగంగా మూడవరోజు అయినా గురువారం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 4,5, వార్డులోని లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పిఎసిఎస్ చైర్మన్ మచునూరి రాజు యాదవ్ తో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ మున్సిపాలిటీ వార్డుల్లో నెలకొన్న సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు .వార్డుల్లో ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని అట్టి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆవుల రాజిరెడ్డి, మచునూరి రాజుయాదవ్

తెలియజేసి సమస్యల పరిష్కార దిశగా తనవంతు కృషి చేస్తానని ఆయన కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు 4,వ 5 వ వార్డులలో పిఎసిఎస్ చైర్మన్ మాచునూరి రాజు యాదవ్ ఆధ్వర్యంలో శరవేగంగా జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను చూసి ఆవుల రాజిరెడ్డి ఆయనను అభినందించారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గుర్రాల మల్లేశం, మాజీ జడ్పిటిసి శ్రీనివాస్‌గుప్తా, కుమ్మరి నగేష్, కుమ్మరి సురేష్, రిజ్వాన్, మాచునూరి శ్రీశైలం యాదవ్, సురేష్‌నాయక్, హబీబ్‌ఖాన్, నరేందర్ రెడ్డి మహేష్‌గౌడ్,కాలనీవాసులు ఉన్నారు.

## కమ్యూనిటీ హాల్‌లో మిగులు పనులకు శ్రీకారం


కమ్యూనిటీ హాల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, జూలై 31, ప్రభాతవార్త:**
భారతీనగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్‌వెల్ సొసైటీ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను గురువారం కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. డివిజన్ పరిధిలోని ఎల్ఐజి కాలనీలో కొనసాగుతున్న వాటర్ డ్రైన్ పనులను, బొంబాయి కాలనీలోని కమ్యూనిటీ హాల్ పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ మిగిలిపోయిన పనులను (స్టోర్ రూం, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, ఫ్లోరింగ్ తదితర) రూ.22లక్షలతో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, జిల్లా కో-ఆర్డినేటర్ చిన్న, ఇంజనీరింగ్ విభాగం ఎఈ ఫైజాన్, ఎల్ఐజికాలనీ, మ్యాక్ సొసైటీ అధ్యక్షులు యాదగిరి రెడ్డి, సలీం, కార్యదర్శి నందగోపాల్, డైరెక్టర్లు పాపయ్య, దుర్గారెడ్డి, రామారావు, మహిళానాయకురాలు కళ్యాణి, నిర్మల, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## దశలవారీగా కలుపు నివారణ చేపడితే అధిక దిగుబడి

-సహాయ వ్యవసాయ సంచాలకులు నూతన్‌కుమార్

**నారాయణఖేడ్, జూలై 31, ప్రభాతవార్త:**
దశలవారీగా కలుపునివారణ చేపడితే అధికదిగుబడి వస్తుందని నారాయణఖేడ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు నూతన్‌కుమార్ అన్నారు. నారాయణఖేడ్ మండలపరిధిలోని చాప్టగ్రామంలో పత్తిపంటను సందర్శించి రైతులకు ప్రస్తుతము చేపట్టవలసిన చర్యలపై వివరించడం జరిగినది. ప్రధానంగా కలుపు నివారణ దశలవారీగా చేపట్టినట్లయితే దిగుబడి అధికంగా రావడం జరుగుతుంది. మొక్క ఎదుగుదలకు తోడ్పడుతుందని తెలిపారు. ప్రధానంగా మందులు ఉదయం వేళలోగాని సాయంత్రం వేళలోగాని పిచికారీ చేసుకొనవలెను. ప్రధానంగా పత్తిపంటలో 60రోజులవరకు కలుపు నివారణ తప్పనిసరిగా చేసుకొనవలెను. పత్తి పంటలో రెండు నుండి నాలుగు ఆకుల దశలో మాత్రమే కలుపు నివారణ చర్యలు చేపట్టాలి. అనగా 15రోజుల నుండి 45రోజుల వరకు చాలా జాగ్రత్తగా కలుపునివారణ చేపట్టాలని అన్నారు. ప్రధానంగా పత్తిలో గుంటుకలు తోలడం 15రోజుల వ్యవధిలో రెండుసార్లు తప్పనిసరిగా గుంటుకలు తోలాలి, ఇలాచేయడం వలన వేరు వ్యవస్థ దృఢంగా తయారై గాలి అంది మొక్క ఎదుగుదలకు తోడ్పాటు జరుగుతుందన్నారు. ప్రధానంగా అంతరకృషి గుంటుకలుతోలడంతోపాటుగా వ్యవసాయశాఖ అధికారుల సూచనలమేరకు మందులను పిచికారి చేసుకోవాలన్నారు. పత్తి పంటలో ప్రస్తుతం 45రోజుల నుండి 60రోజుల దశలో ఉన్నది పత్తిపంటలో రసంపీల్చే పురుగులు అనగా పేనుబంక తెల్లదోమ పచ్చదోమ పిండినల్లి ఆశించడం జరిగినది. దీని నివారణకు పసుపు రంగు కాని నీలిరంగు కాని జిగురు అట్టలు ఎకరానికి 10నుండి 12 పంటలో అక్కడక్కడ తప్పనిసరిగా పెట్టాలి. అదేవిధంగా ప్రాథమికదశలో ఆశించినట్లయితే వేపనూనె 5మిల్లీమీటర్లు ఒకలీటర్ నీటికి కలిపి గుడ్డుదశలో పిచికారి చేసుకోవాలి. పురుగుమందులు అనగా ఎసిటమైప్రిడ్, తయోమితాక్సామ్, ఫిప్రోనిల్, డైఫెంతురన్‌వంటివి పిచికారి చేసుకున్నట్లయితే ఈరసంపీల్చే పురుగుల ఉధృతినుండి పంటను కాపాడుకోవచ్చన్నారు.

## ప్రిన్సిపాల్‌గా తన్వీర్ ఫాతిమా

**కంది, జూలై 31, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన కందిలోని ఎంపి జిపిఎస్ ఉర్దూ పాఠశాల ప్రిన్సిపాల్‌గా తన్వీర్ ఫాతిమా గురువారం బాధ్యతలు స్వీకరించారు. పాఠశాలను ఎంఈఓ జోగప్ప సందర్శించి హాజరు పట్టికలను పరిశీలించారు. పాఠశాలలో మూత్రశాలల ఇబ్బందులను తొలగించేందుకు బిఆర్ఎస్ నాయకులు ఖాజాఖాన్ మరమ్మత్తులకు గాను 12వేల రూపాయలను అందచేశారు.

## పెసర పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

**న్యాల్‌కల్, జూలై 31, ప్రభాతవార్త:**
మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులకు నాణ్యమైన విత్తనాల కార్యక్రమంలో భాగంగా రైతులకు అందచేసిన పెసరవిత్తనాలను సాగుచేస్తున్న పెసరపంటలను గురువారం మండల వ్యవసాయ అధికారి అభిలాష్‌వర్మ సందర్శించారు. మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామానికి చెందిన భీమన్న సాగుచేసుకుంటున్న పెసరపంటను పరిశీలించి అధిక దిగుబడికి పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై వివరించారు. పంట చేతికి అందాక ఆవిత్తనాలను రైతులకు అందచేయాలని రైతు భీమన్నకు ఎఓ సూచించారు. గ్రామంలో రైతులు సాగుచేస్తున్న పత్తిపంటలను పరిశీలించి పంటల అధిక దిగుబడికి యూరియాతోపాటు విడతలవారీగా కాంప్లెక్స్ ఎరువులను వినియోగించాలని వ్యవసాయ అధికారి అభిలాష్‌వర్మ అన్నారు.

## పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం

**హత్నూర, జూలై 31, ప్రభాతవార్త:**
పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ మూడు నెలల్లోగా నిర్ణయంతీసుకోవాలని సుప్రీంకోర్టుతీర్పునివ్వడాన్ని ఆహ్వానిస్తున్నట్లు హత్నూర మండలం దౌల్తాబాద్‌గ్రామ బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు అజ్మత్ అలీ(అజ్జు) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసనసభ స్పీకర్, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని కోరారు. ఒకపార్టీ నుంచి గెలిచిన చట్టసభసభ్యులు మరో పార్టీలోకి ఫిరాయిస్తే వారిపై ఇచ్చిన అనర్హతపిటిషన్ల ఏళ్లతరబడి నాన్చకుండా వేగంగా చర్యలు తీసుకోవాలని. సుప్రీంకోర్టు ఆదేశించడం ఆహ్వానించదగ్గ పరిణామం అని ఆయన తెలిపారు.

## మీనాక్షినటరాజన్ పర్యటనను అడ్డుకుంటాం

-బిజెపి మండల అధ్యక్షులు ప్రవీణ్‌ముదిరాజ్


పోసానిపల్లికి వెళ్లే రోడ్డు దుస్థితిని వివరిస్తున్న బిజెపి నాయకులు

**చౌటకూరు, జూలై 31, ప్రభాతవార్త:**
నిత్యం ప్రమాదాలకు కారణమవుతున్న మండల కేంద్రమైన చౌటకూరు నుంచి పోసానిపల్లికివెళ్లే రోడ్డు దుస్థితి దయనీయంగా మారిందని, ప్రమాదాలకు కారణమవుతున్న రోడ్డును వెంటనే సరిచేయాలని లేకుంటే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షినటరాజన్ పాదయాత్రను అడ్డుకోవాల్సి వస్తుందని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ప్రవీణ్ ముదిరాజ్ హెచ్చరించారు. గురువారం పోసానిపల్లి రోడ్డును పరిశీలించిన సందర్భంగా ప్రవీణ్‌ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రమంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న స్థానిక ఎమ్మెల్యే సి.దామోదర్ రాజనర్సింహ స్వంత నియోజకవర్గంలో రోడ్లు ఇంత దారుణంగా ఉంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. రోడ్డుపై నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మీనాక్షినటరాజన్ పాదయాత్రను జాతీయ రహదారి మీదుగా కాకుండా చౌటకూరు మండలంలోని గ్రామాల మీదుగా పాదయాత్ర సాగేలా చూడాలని డిమాండ్ చేశారు. నటరాజన్ పాదయాత్రను గ్రామాల గుండా కాకుండా జాతీయరహదారిమీదుగా నిర్వహిస్తే పాదయాత్రను అడ్డుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి మాజీ మండల అధ్యక్షులు రాజు, బిజెవైఎం ఉపాధ్యక్షులు శివకుమార్, మండల కార్యవర్గసభ్యులు గోపియాదవ్, దళిత మోర్చా అధ్యక్షులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

**చిన్నశంకరంపేట, జూలై 31,ప్రభాతవార్త:**
సేంద్రియ ఎరువులు వాడి వ్యవసాయంలో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి శేఖర్ అన్నారు. గురువారం నాడు మండల పరిధి మడూర్ గ్రామంలో సెహఫుల్ ఫౌండేషన్, హెడీఎఫ్ పరివర్తన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. భూమిని సారవంతంగా ఉంచుకోవాలని, అందుకు అవసరమైన సేంద్రియ ఎరువుల గురించి, వాటి వాడకం గురించి వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రతిభ, సేఫుల్ ఫౌండేషన్ సభ్యులు మనదీప్, గౌతమ్, విక్రాంత్, కావ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

-ఆర్డీఓ కార్యాలయం ఎదుట విద్యార్థుల ధర్నా



పెండింగ్ స్కాలర్‌షిప్‌లు చెల్లించాలని ఆర్‌డిఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు

**జహీరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:**
పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజ్ రియంబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు నిరసన వ్యక్తంచేస్తూ ధర్నా నిర్వహించారు. గురువారం పట్టణంలోని ఆయా కళాశాలలకు చెందిన 2వేలమంది విద్యార్థులు పిడిఎస్‌యు ఆధ్వర్యంలో పట్టణంలోని ఆచార్య డిగ్రీకళాశాల నుంచి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఆర్‌డిఓకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎం.సురేష్ మాట్లాడుతూ ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని గతంలో కాంగ్రెస్‌పార్టీ అమలు చేసిందని, 13ఏళ్ల తరువాత అధికారంలో కాంగ్రెస్‌పార్టీ ఉన్నత విద్యను అందిస్తున్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థులకు అందించాల్సిన బకాయిలను విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి రావాల్సిన రూ.7200కోట్లు చెల్లించాల్సి ఉండగా కరీంనగర్ గ్రాడ్యుయేట్స్, అధ్యాపక ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అరకొరగా నిధులను విడుదల చేసిందని, ఎన్నికల కోసమే ఆ నిధులను విడుదల చేసిందని ఆరోపించారు. ప్రపంచ అందాలపోటీలకు రూ.2వందల కోట్లు ఖర్చుచేసిన కాంగ్రెస్‌ప్రభుత్వం చదువుకుంటామంటే నిధులెందుకు విడుదల చేయడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిధులను వెంటనే విడుదలచేయాలని, ప్రభుత్వం స్పందించకుంటే జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు సందీప్, జిల్లా సహాయ కార్యదర్శి అనిల్, జిల్లానాయకులు శ్రీకాంత్, దినేష్, డివిజన్ నాయకులు ఎండి ఇస్మాయిల్, గోపాల్, రాకేష్, సుస్మిత, స్వాతి, రాణి, మల్లేశ్వరి, స్వప్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐని సన్మానించిన కాంగ్రెస్ నేతలు


ఎస్ఐ రామకృష్ణను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**నాగల్‌గిద్ద, జూలై 31, ప్రభాతవార్త:**
ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణను గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్‌రావుపాటిల్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. మండలంలో శాంతిభద్రతలకు తమవంతు సహకారం అందిస్తామని నాయకులు ఎస్ఐకి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు సంజీవరావుపాటిల్, మనోహర్‌రావు పాటిల్, బస్వరాజ్ నాగపూరే బస్వరాజ్, సోపాన్‌రావుపాటిల్, జంగం బస్వరాజ్, విజయ్‌కుమార్ గాడ్డే, నరసింగ్‌రావుపాటిల్, రూప్‌సింగ్, విజయ్‌కుమార్‌స్వామి, నాగప్ప, విఠల్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు సోమిదాస్, ఎస్టీసెల్ అధ్యక్షులు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

-వీడ్కోల సభలో ఎంఈఓ మాణయ్య



ఉపాధ్యాయిని సరస్వతిని సన్మానిస్తున్న దృశ్యం

**జహీరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:**
నేటిబాలలను భావిభారతపౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని మండల విద్యాధికారి మాణయ్య అన్నారు. గురువారం పట్టణంలోని నంబర్ 3 పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా సేవలు అందించిన బి.సరస్వతి మొగులయ్య గౌతం పదవీవిరమణ పొందడంతో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాణయ్య మాట్లాడుతూ 36సంవత్సరాలుగా విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషిచేసిన సరస్వతి తోటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సరస్వతి మొగులయ్య దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందచేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బి.శంకరయ్య, నంబర్ 3 పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటస్వామిగౌడ్, ఉపాధ్యాయులు, సరస్వతి కుటుంబసభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పదవీవిరమణ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి


ప్రిన్సిపాల్ దంపతులను సన్మానిస్తున్న మాజీ జడ్పిటిసి నరసింహారెడ్డి

**నారాయణఖేడ్, జూలై 31, ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం జూకల్ శివారులోగల టిజిఎస్‌డబ్ల్యుఆర్ఎస్ స్కూల్(తెలంగాణస్టేట్ సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూలు) ప్రిన్సిపాల్ లింగారెడ్డి పదవీవిరమణ సందర్భంగా లింగారెడ్డి దంపతులను మాజీ జడ్పిటిసి జి.నరసింహారెడ్డి శాలువాతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ లింగారెడ్డి 32సంవత్సరాల జీవితంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడెక్కడ పదవులు (ఏ జిల్లాలలో) చేసినా మచ్చలేనివ్యక్తిగా పేరుపొందిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో టిజిఎస్‌డబ్ల్యుఆర్ఎస్ లెక్చరర్స్ సంజీవులు, లింగారెడ్డి ఫ్యామిలీ తదితరులు ఉన్నారు.

## జనహిత పాదయాత్రను విజయవంతం చేయాలి

-ఎమ్మెల్యేకు ప్రోటోకాల్ తప్ప ప్రజల అభివృద్ధిపై ధ్యాస లేదు
-నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్

**నర్సాపూర్, జూలై 31, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకుగాను నేటినుంచి ఆగస్టు 4వరకు కాంగ్రెస్ జనహిత పాదయాత్ర పేరుతో ప్రజల వద్దకు కాంగ్రెస్ అనే కార్యక్రమాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నారు. పాదయాత్రకు కాంగ్రెస్‌శ్రేణులుహాజరై విజయవంతం చేయాలని కాంగ్రెస్‌పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్‌లు అన్నారు. గురువారం నియోజకవర్గ క్యాంపుకార్యాలయంలో విలేకరులసమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశంలో వారుమాట్లాడుతూ రాష్ట్రకాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షినటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌లు కలిసి పాదయాత్ర శ్రమదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈపాదయాత్ర మొదటగా ఆందోల్‌నియోజకవర్గంలోని సంగుపేటచౌరస్తా నుండి ప్రారంభమై పదికిలోమీటర్ల వరకు ఈపాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఈపాదయాత్ర ముఖ్యఉద్దేశం కాంగ్రెస్‌పార్టీ విధానాలను ప్రజల్లోకి మరింతలోతుగాతీసుకువెళ్లడం, పార్టీని సంస్థాగతంగా మరింత ప్రతిష్ఠావంతంగా చేయడంకోసం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు నవీన్‌గుప్తా, చింతల కరుణాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, మండలపార్టీ అధ్యక్షులు గుర్రాల మల్లేశం, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపిపిలు జ్యోతి సురేష్‌నాయక్, లలితానర్సింగ్‌నాయక్, పట్టణాధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నాయకులు ఉదయ్‌కుమార్, మహేశ్వర్‌రెడ్డి, శేఖాగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రశీద్, వినోద, రామాగౌడ్, మన్నే భీమ్, నరేష్, అశోక్, అజ్మత్, మణిదీప్, హరీష్ వర్ధన్, మున్ను, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇషాంత్‌రెడ్డికి నివాళులు

**న్యాల్‌కల్, జూలై 31, ప్రభాతవార్త:**
ప్రత్యేకతెలంగాణ కోసం యూనివర్సిటీ క్యాంపస్‌లో ఆత్మాహుతి చేసుకున్న మండలపరిధిలోని బసంత్‌పూర్ గ్రామానికి చెందిన ఇషాన్‌రెడ్డికి గురువారం మండలపరిధిలోని మల్గిగ్రామంలోని బిఆర్ఎస్‌పార్టీ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఇషాంత్‌రెడ్డి చిత్రపటానికి మాజీ సర్పంచ్ జడ్గొండ మారుతి, మాజీఎంపిటిసి సభ్యులు శివానంద్ శ్రీపతి, బిఆర్ఎస్ గ్రామకమిటీ అధ్యక్షులు సిద్దారెడ్డి, యువనాయకులు శాంత్ కుమార్, గణపతిలు పూలమాలతో ఘననివాళులు అర్పించారు.